నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
సోమవారం | మార్చి 10, 2025 | www.navatelangana.com

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలందరూ సహకరించాలి



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు, ఆర్‌పిఎఫ్ సిబ్బంది

నవతెలంగాణ-కామారెడ్డి

శాంతిభద్రతల పరిరక్షణకై ప్రజలందరూ సహకరించాలని దేవునిపల్లి ఎస్సై రాజు అన్నారు. దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కాకతీయ నగర్, గాయత్రి నగర్, దేవనపల్లి, సారంపల్లి లో ఆర్‌ఏఎఫ్ సిబ్బందితో శాంతి భద్రతల పరిరక్షణకై ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు సిఐపి కామారెడ్డి రూరల్ ఆధ్వర్యంలో ఆర్ ఏ ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ వారి సిబ్బంది దేవునిపల్లి పోలీస్ స్టేషన్ సిబ్బందితో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.

కోతుల దాడిలో ఒకరికి గాయాలు



నవతెలంగాణ-బాల్కొండ

కోతులు దాడి చేసి ఓ వ్యక్తిని తీవ్రంగా గాయపరిచిన ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. నెహ్రూ నగర్ కాలానికి చెందిన మహమ్మద్ హుస్సేన్ తను రోజు పని నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లేవాడు, ఆదివారం స్వల్ప జ్వరం కారణంగా పనికి వెళ్లలేదు. ఉదయం తన ఇంటి వద్ద గోడలపై ఉన్న కోతులను గమనించకుండా ఇంటి లోపల నుంచి బయటికి రావడంతో ఒక్కసారిగా అతనిపై కోతి దాడి చేసింది. కోతి దాడితో అతని చేతిపై తీవ్ర గాయం అయింది. చికిత్స నిమిత్తం బాధితుడు ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి వ్యాక్సిన్ తీసుకున్నాడు. నెల వ్యవధిలోనే గ్రామంలో సుమారు 20 మందికి పైగా కోతుల బారిన పడ్డారని స్థానికులు వాపోయారు. అధికారులు స్పందించి కోతుల సమస్య నుంచి విముక్తి కలిగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సీపీకి సవాళ్ల స్వాగతం

- నేడు పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించనున్న సాయిచైతన్య





నవతెలంగాణ-కంఠేశ్వర్

అదుపులేని గంజాయి సరఫరా, వినియోగం, విచ్చలవిడిగా సాగుతున్న గుట్కా, మట్కా.. జోరుగా సాగుతున్న పేకట, మహారాష్ట్ర నుంచి నకిలీ మద్యం, మట్కారాయుళ్లు, పోలీస్ ఠాణాల్లో సివిల్ పంచాయతీలు, నెలవారీ మామూళ్లు జోరుగా ఇసుక అక్రమ రవాణా, నగరంలో గ్యాంగుల సెటిల్‌మెంట్లు, కత్తిపోట్లు తదితర కేసులు నూతన సీపీకి సవాళ్లు విసురుతున్నాయి. ఇలాంటి కేసులపై సీపీ తనదైన ముద్ర వేయగలిగేనా అని చర్చలు వినిపిస్తున్నాయి. నేడు(సోమవారం) నిజామాబాద్ పోలీస్ కమిషనర్‌గా సాయి చైతన్య బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఐదు నెలల తర్వాత నిజామాబాద్ సీపీగా సాయి చైతన్య బాధ్యతలు చేపట్టనున్నారు. రాజకీయ ఆధిపత్యం కొనసాగే నిజామాబాద్ జిల్లాలో బాధ్యతల నిర్వహణ కత్తి మీద సాములాగానే ఉంటుంది. అనేక ఒత్తిళ్ల నడుమ గతంలో పోలీస్ బాస్‌లు విధులు నిర్వహించారు. ప్రతి విషయంలో రాజకీయ జోక్యం ఎక్కువ కావడంతో పోలీస్ విధులు సవాల్‌గా మారుతుంది. 5 నెలల తర్వాత నిజామాబాద్ సిపిగా వస్తున్న సాయి చైతన్య ఎంత మేర సవాలను అధిగమించి సక్సెస్ అవుతారు అనేది కొత్త బాస్ ముందుంది.

జిల్లా వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్లలో సివిల్ పంచాయతీలు జోరుగా జరుగుతున్నాయి. ప్రతి పనికి రేటు కట్టి డబ్బులు వసూలు చేయడం పనిగా పెట్టుకున్నారు. వసుల కోసం పోలీస్ స్టేషన్లో ప్రత్యేక వ్యక్తులను పెట్టుకుంటారు. వీరితో పాటు పైరవీకారులు భారీ ఎత్తున ప్రతి పోలీసుల పరిధిలో ఉన్నారు. పైరవీకారులు జోక్యం చేసుకొని మధ్య దళారులుగా పోలీసులకు డబ్బులు ఇచ్చేస్తారు. డబ్బులు ఇవ్వకుంటే తిమ్మిని బమ్మి చేసి పంపించేస్తారు. లేదంటే పోలీస్ స్టేషన్లో కాదు కోర్టులో చూసుకోవాలని పంపించేస్తారు అనే ఆరోపణలు సైతం రోజురోజుకు వస్తున్నాయి. ఇలాంటి సంఘటనలు అనేక జరుగుతున్న దష్ట్యా కొత్త బాస్.. పోలీస్ వ్యవస్థను గాడిలో పెడతారని భావిస్తున్నారు.

నేడు బాధ్యతలు స్వీకరించనున్న సీపీ

నిజామాబాద్ పోలీస్ కమిషనర్‌గా సాయి చైతన్య సోమవారం ఉదయం బాధ్యతలు స్వీకరించనున్నట్టు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ అధికారులకు సమాచారం అందింది. ఈ మేరకు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాట్లు చేసి అన్ని సిద్ధం చేస్తున్నారు. హైదరాబాద్ నార్కోటిక్ విభాగంలో ఎస్పీ విధులు నిర్వహిస్తున్న సాయి చైతన్య ను శుక్రవారం నిజామాబాద్ సీపీ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.

ఇక సిపి నియామకంతో అవినీతి, విధినిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిలో గుబులు మొదలైందంటున్నారు. ముక్కుసూటి అధికారిగా గుర్తింపున్న సాయి చైతన్య అవినీతి, అక్రమాలను సహించరని, విధుల్లో నిర్లక్ష్యం చూపేవారిపై కఠినంగా వ్యవహరిస్తారని, ఒత్తిళ్లు వచ్చినా వెనక్కితగ్గరనే ప్రచారం జరుగుతోంది.

కార్యదర్శుల క'నీటి' కష్టాలు

- చెడిపోతున్న పంచాయతీ బోరు మోటర్లు
- నిధులు లేక ఆర్థిక ఇబ్బందులలో కార్యదర్శులు
- జీపీవి ఉద్దెర పనులు చేయబోమంటున్న మెకానిక్‌లు
- నీటి కొరత రానీయొద్దంటూ జిల్లా అధికారుల ఆదేశాలు
- సతమతమవుతున్న సెక్రటరీలు







బోర్‌మోటార్ చెడిపోవడంతో మరమ్మతుల కోసం బయటకు తీసివేత.. లీకేజీ వాల్వ్‌ను సరి చేస్తున్న సిబ్బంది.. బోర్‌మోటార్ మరమ్మతులు

నవతెలంగాణ-భిక్కనూర్

వేసవికాలం ముంచుకొచ్చింది. మార్చిలోనే ఎండలు దంచుతున్నాయి. దీంతో భూగర్భ జలాలు అడుగంటి పోతుండటంతో బోర్లు వట్టిపోతున్నాయి. ఈ క్రమంలో బోరు మోటార్లు చెడిపోతున్నాయి. వాటిని మరమ్మతులు చేయిద్దామంటే కార్యదర్శులకు తలకుమించిన భారం అవుతుంది. ఇప్పటికే జీపీలకు నిధులు రాక అప్పులు చేసి గ్రామ పాలనను నెట్టుకొస్తున్న తమకు.. బోరు మోటార్ల మరమ్మతులు చేయించేంత ఆర్థిక పరిస్థితి తమకు లేదని వాపోతున్నారు. జీపీ సెక్రటరీలు స్థానికంగా ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటుంటే.. పై నుంచి ఉన్నతాధికారులు వేసవి నేపథ్యంలో గ్రామాలలో నీటి కష్టాలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఆదేశాలిస్తున్నారే కానీ సమస్య పరిష్కారానికి మార్గం చూపడం లేదని వారు వాపోతున్నారు. బోరుమోటారు మరమ్మతులు చేయించే పరిస్థితి లేక గ్రామంలో నీటి సదుపాయం కల్పించలేక కార్యదర్శులు కన్నీటి' కష్టాలు ఎదుర్కొంటున్నారు.

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 22 మండలాల్లో 535 గ్రామాలు ఉన్నాయి. సర్పంచుల పదవీకాలం ముగిసి సంవత్సరం కాలం గడిచిన నాటి నుండి నేటి వరకు కేంద్ర ప్రభుత్వ నిధులు మంజూరు కాకపోవడం, రాష్ట్ర ప్రభుత్వం నుండి స్టేట్ ఫైనాన్స్ నిధులు విడుదల చేయకపోవడం, గ్రామ పంచాయతీకి వచ్చే ఆదాయం జనరల్ ఫండ్‌లో డిపాజిట్ చేసినా ఫ్రీజింగ్‌లో ఉండడం వలన గ్రామపంచాయతీలలో ఉన్న అరకొర నిధులతో సంవత్సర కాలం నుండి పంచాయతీ కార్యదర్శులు జిపి పాలన కొనసాగిస్తున్నారు. ఒక్కో గ్రామ పంచాయతీలు ఒక్కో విధమైన సమస్యలు, ఇబ్బందులను అధిగమిస్తూ, తమ సొంత జీతాలు, కుటుంబ అవసరాల దాచిన డబ్బులు, బయట నుండి అప్పు చేసి సమస్య పరిష్కారం చేస్తున్నారు. గ్రామపంచాయతీ అవసరాలకు తీసుకువచ్చే దుకాణాల వద్ద ఉద్దెర బాకీలు ఎక్కువ అవ్వడం కారణంగా గ్రామపంచాయతీ అవసరాలకు ఉద్దెర ఇవ్వమంటే ఏ దుకాణదారుడు కూడా పంచాయతీకి మేము ఏవీ ఉద్దెర ఇవ్వమని కరాకండిగా చెప్పేస్తున్నారు.

వేసవి కాలంలో ప్రతి ఇంటికి మంచినీరు చాలా అవసరం. ఎట్టి పరిస్థితిలో కూడా గ్రామ ప్రజలకు నీటి కష్టాలు లేకుండా చూడాలని అధికారులు ఒకవైపు ఒత్తిడి చేయడం మరోవైపు గ్రామాలలోని బోరు మోటర్లు చెడిపోవడం, మోటార్ల దొంగతనం, పైప్ లైన్ లీకేజ్ అవ్వడం వంటి సమస్యలను ఏ విధంగా పరిష్కరించాలో తెలియక నిధుల కొరతతో కార్యదర్శులు తలలు పట్టుకుంటున్నారు. సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందా అంటే ఒక్క రూపాయి కూడా విడుదల చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సర్పంచ్ ఎన్నికలు జరిగి పదవి బాధ్యతలు చేపడితే తప్ప 15 ఫైనాన్స్ నిధులు వచ్చేలా లేవు. గ్రామ సర్పంచులు ఉంటే గ్రామస్తుల సమస్యలు పరిష్కరించడానికి ముందుకు వచ్చేవారు. గ్రామస్తులు ఒకవైపు, ప్రజా ప్రతినిధులు ఒకవైపు గ్రామ సమస్యలు పరిష్కరించాలని కార్యదర్శులపై ఒత్తిడి తీసుకొస్తుండటంతో వారు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. తమ సొంత ఇంటి ఖర్చులు, ఈఎంఐ లు చెల్లించుకోలేని స్థితిలో కార్యదర్శులు ఉన్నారంటే ఎంత ఇబ్బందులు పడుతున్నారో అర్థం చేసుకోవచ్చు.

మేజర్ గ్రామపంచాయతీలలో సరిపడే నిధులు ఉన్నా చిన్న చిన్న గ్రామపంచాయతీలలో నిధులు లేక కరెంట్ బిల్లులు, మోటార్ రిపేర్లు, వీధి దీపాల సమస్యలు పరిష్కరించడంలో కార్యదర్శులు నిధులు లేక ఇక్కట్లు పడుతున్నారు.

వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మోటార్ రిపేర్లకు, వాటర్ ట్యాంకర్ ద్వారా నీటి సరఫరాకు, గ్రామాలలో నీటి కష్టాలు తీర్చడానికి నిధులు సమకూరు ఇస్తే తప్ప రానున్న రోజుల్లో ఎండలు తీవ్రమవుతున్న సమయంలో నీటి కష్టాలు తీర్చడానికి ఇబ్బందులు పడాల్సి వస్తుందని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలోని చాలా గ్రామపంచాయతీలలో బోరు మోటర్ రిపేర్లు, దొంగతనాలు, పైప్ లైన్ లీకేజీ వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. మోయలేని భారంగా తయారైన క"నీటి" సమస్యలకు అధికారులు, ప్రభుత్వం నిధులు విడుదల చేసి సమస్య పరిష్కార మార్గం చూపిస్తారా.? లేకుంటే ప్రభుత్వం, ఉన్నతాధికారులు ఆదేశాలకే పరిమితమవుతారా లేకుంటే జీపీలను నిధులు సమకూర్చి ఆదుకుంటారా వేచి చూడాల్సిందే.

ఎస్ఆర్ విద్యార్థిని చితకబాదిన ఫ్లోర్ ఇంచార్జ్

- చదువుకుంటలేడేమోనని వాతలు తేలేలా కొట్టిన వైనం
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు



విద్యార్థి చేతిపై వాతలు.. టీషర్ట్ చించివేత



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

స్టడీ అవర్‌లో చదువుకుంటలేడేమోనని భావించి ఎస్ఆర్ విద్యాసంస్థలో ఇంటర్ విద్యార్థిని ఫ్లోర్ ఇన్‌చార్జి చితకబాదిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. బాధిత విద్యార్థి తల్లిదండ్రుల వివరాల ప్రకారం.. ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు కొనసాగుతున్న విషయం విధితమే. కాగా సోమవారం ఇంగ్లీష్ పరీక్ష ఉన్న సందర్భంగా విద్యార్థులు పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నారు. నిర్మల్ జిల్లాకు చెందిన వాహజ్ ఉద్దీన్ నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ విద్యాసంస్థలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. ఎంపీసీ చదువుతున్న వాహజ్ ఉద్దీన్ ఆదివారం స్టడీ అవర్స్ లో పరీక్ష లకు ప్రిపేర్ అవుతున్న సందర్భంలో.. చదువుకోకుండా ఉన్నాడని భావించి ఫ్లోర్ ఇన్‌చార్జి విద్యార్థికి వాతలు తేలేలా చితకబాదాడు. దీంతో విద్యార్థి వారి తల్లిదండ్రులకు ఫోన్‌చేసి సమాచారం ఇచ్చాడు. కాలేజీ హాస్టల్‌కు చేరుకున్న తల్లిదండ్రులు.. జరిగిన ఘటన పట్ల చర్యలు తీసుకోవాలని రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఈ విషయమై మీడియా ప్రతినిధులు ఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ హనుమంతరావుని వివరణ కోరగా ఇక్కడ ఎటువంటి విద్యార్థికి దెబ్బలు తగలలేదని, ఎవరిని విద్యార్థులకు కొట్టలేదని, ఇక్కడ ఎటువంటి సమస్య ఏర్పడలేదని మీడియాకు బదులు ఇవ్వడం గమనార్హం. ర్యాంకుల కోసం విద్యార్థులను హింసిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

సంస్కారంలేని వ్యక్తి అరవింద్

- పెద్దలను గౌరవించినవారికే రాజకీయ భవిష్యత్
- పసుపు అంశం పక్కదోవ పట్టించేందుకే నవోదయ ముందుకు
- సుదర్శన్‌రెడ్డి చేయించిన అభివృద్ధి నీ తరం కాదు : కాంగ్రెస్ ధ్వజం



మాట్లాడుతున్న కేశ వేణు, తాహెర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

'గత వారం రోజులుగా నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ తలతిక్క మాటలతో చేస్తున్న తెలివి తిక్క వాదనలను జిల్లా ప్రజలు గమనిస్తున్నారు. నిజామాబాద్ జిల్లాకు మెడికల్ కాలేజీని, సాగునీటి ప్రాజెక్టులను తీసుకువచ్చింది సుదర్శన్ రెడ్డి అని, అరవింద్ మాట్లాడే ముందు వయసును దృష్టిలో ఉంచుకొని మాట్లాడాలని' నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిన ప్రతిసారి అరవింద్ అబద్ధపు వాదనాలతో ప్రజలను తప్పుదోవ ప్రయత్నము చేస్తున్నాడని, గత సంవత్సరంలో పసుపు ధర పెరిగితే కేంద్ర ప్రభుత్వం వల్లనే పెరిగిందని చెప్పిన అరవింద్ ప్రస్తుతం పసుపు ధర రోజు రోజుకి తగ్గుతుంటే దానిని తప్పించుకోవడానికి కాంగ్రెస్ నాయకులపై అబద్ధపు వాదనలు చేస్తున్నాడని, దానిని పక్కదోవ పట్టించేందుకే జవహర్ నవోదయ అంశాన్ని ముందుకు తీసుకువచ్చినట్టు విమర్శించారు. పెద్దలను గౌరవించినప్పుడే రాజకీయ నాయకుడిగా భవిష్యత్తు ఉంటుందని కేవలం ఎన్నికల్లో గెలుపు ఓటములే రాజకీయ నాయకుడి లక్షణం అని అనుకుంటే అది అరవింద్ తెలివితక్క ఆలోచనకు నిదర్శనమని మండిపడ్డారు. నిజామాబాద్ జిల్లాలో అభివృద్ధిలో సుదర్శన్‌రెడ్డితో పోటీ ఎవరికీ లేదు అని సాగునీటి రంగంలో విద్యారంగంలో సుదర్శన్ రెడ్డి గననీయమైన అభివృద్ధి చేసినట్టు పేర్కొన్నారు. అరవింద్ తన రాజకీయ జీవితంలో అంతలా అభివృద్ధి చేయలేడని పేర్కొన్నారు.

ఎంపీ తీవ్రంగా ఖండిస్తున్నాం : రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తహేర్ బిన్ హొందన్

ఎంపీ అరవింద్ వ్యాఖ్యలను ఖండిస్తున్నట్టు రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నుడా చైర్మన్ కేశవేణు తెలిపారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. నవోదయ పాఠశాలను ఎక్కడ ఏర్పాటు చేయాలి అనేది ఎంత స్థలం కావాలి అనేది రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి అధికారులు జిల్లా కలెక్టర్ నిర్ణయం తీసుకుంటారు అనే ఇంగిత జ్ఞానం కూడా అరవింద్‌కు లేదు అని విమర్శించారు. నవోదయ పాఠశాలను నిజామాబాద్ జిల్లాలో ఏర్పాటు చేయాలని ఆలోచన మాత్రమే వచ్చింది కానీ ఎక్కడ ఏర్పాటు చేయాలనేది ఇంకా నిర్ణయించలేదని, ప్రతి ఎమ్మెల్యే తమ నియోజకవర్గంలో రావాలని కోరుకోవడం సహజమే అని, కానీ నవోదయ పాఠశాలకు అనువైన 30 నుండి 35 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వాధికారులు కలెక్టర్ పరిశీలించి నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. గతంలో ట్రిబుల్ ఐటీని కూడా బాసరలో ఏర్పాటు చేసి దాని ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి దాని ఫలితాలు ఏ విధంగా వచ్చాయో అందరికీ తెలుసు అని, అదే మాదిరిగా నవోదయ పాఠశాలను కూడా అన్ని పరిస్థితులను పరిశీలించి ఎక్కడ ఏర్పాటు చేయాలనే నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిపారు. నిజాంషుగర్ ఫ్యాక్టరీ, పసుపు పంటకు మద్దతు ధర తదితర అంశాల తప్పించుకునేందుకే చవకబారు ఆరోపణలు వ్యక్తం చేస్తున్నట్టు విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతరెడ్డి రాజారెడ్డి,రాష్ట్ర ప్రచార కమిటీ మెంబర్ జావేద్ అక్రమ్,మాజీ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గోపి,రాష్ట్ర ఎన్ ఎస్ యు ఐ ప్రధాన కార్యదర్శి వేణు రాజ్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కేశ మహేష్,సాకినల శివ కుమార్,జగడం సుమన్, తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్‌కు అడ్డగోలు వసూలు

- చర్యలు తీసుకుంటామని ఆర్ఐ నరసింహారెడ్డి హామీ

నవతెలంగాణ-కామారెడ్డి


ఆధార్‌ను అప్‌డేట్ చేసేందుకు, మార్పులు చేర్పులు చేసేందుకు నిర్దేశత రుసుము కంటే పలు ఆధార్ సెంటర్ నిర్వహకులు అధిక మొత్తంలో వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని గడిరోడ్‌లో గల ఆధార్ సెంటర్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఆధార్ అప్‌డేట్ కోసం వచ్చే ప్రజల నుంచి 50 రూపాయలు తీసుకోవాల్సి ఉండగా రూ.130 తీసుకుంటూ, వంద రూపాయలు తీసుకోవాల్సి ఉండగా 150 రూపాయలు తీసుకుంటూ ఆధార్ సెంటర్ అప్డేట్ కోసం వచ్చే వారి నుండి అక్రమంగా వసూలు చేస్తున్నట్టు ఫిర్యాదు రావడంతో కామారెడ్డి పట్టణ రెవెన్యూ ఆఫీసర్ నరసింహారెడ్డి సెంటర్‌ను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు వసూలు చేస్తున్నట్టు తేలడంతో ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తానని తెలిపారు.

ఆధార్ సెంటర్ లను తనిఖీ చేయని అధికారులు

జిల్లావ్యాప్తంగా ఆధార్ సెంటర్లను ఆధార్ జిల్లా అధికారులు తనిఖీలు చేయవలసి ఉండగా అధికారులు మాత్రం తనిఖీలు చేయక, రికార్డులను పరిశీలించకపోవడంతో పలువురు ఆధార్ సెంటర్‌ల నిర్వాహకులు ఇష్టారీతిగా వ్యవహరిస్తూ అధిక డబ్బులు వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నామయి. గత కొన్ని సంవత్సరాలుగా ఈ ఆధార్ సెంటర్లో ఈ అక్రమ వసూలు జరుగుతున్న ప్రైవేటు వ్యక్తికి అగ్రిమెంట్ ఇచ్చినా బిఎస్ఎన్ఎల్ అధికారులు కానీ ఆధార్ సెంటర్ జిల్లా అధికారులు కానీ తనిఖీలు చేయకపోవడంతో నిర్వాహకులు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఎలుగుబంటి సంచారం

- భయాందోళనకు గురవుతున్న స్థానికులు



నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండల కేంద్రంలోని మత్తడి పోచమ్మ ఆలయకు వెళ్లే రోడ్డు సమీపంలో పంట పొలాల్లో ఎలుగుబంటి సంచరించడంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. గత రెండు రోజులుగా గ్రామ సమీపంలోని మత్తడి కిందిపల్లి సమీపంలోని బొబ్బిలి ఈరన్న గుట్ట నుండి తాగునీటి కోసం సమీప పంట పొలాల్లోకి ఎలుగుబంటి వస్తుందన్నారు. గుట్టపై నుండి పంట పొలాల్లోకి ఎలుగుబంటి రావడంతో భక్తులు పంట పొలాల్లో ఉన్న వ్యవసాయదారులు వెలుగుబంటిని చూసి భయభ్రాంతులకు గురవుతున్నారు.

ఎండలు తీవ్రం కావడంతో అటవీ ప్రాంతంలో ఎలుగుబంట్లకు వన్యప్రాణులకు తాగునీరు దొరకకపోవడంతో తాగునీటి కోసం పంట పొలాల వద్దకు వస్తున్నాయి. దీంతో పొలాల వద్దకు కాపాలకు వెళ్లేవారు ప్రాణాలు అరచేతులో పెట్టుకొని వెళ్లాల్సి వస్తుంది. అదేవిధంగా పశువుల కాపర్లు మేకల కాపర్లు అటవీ ప్రాంతానికి వెళ్లాలంటే జంకుతున్నారు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు ఎలుగుబంటుకు బోన్ ఏర్పాటుచేసి అటవీ ప్రాంతాలకు తరలించాలని గ్రామ ప్రజలు భక్తులు పలువురు కోరుతున్నారు.

అనేక మలుపులు రోడ్డుపక్కన గుంతలు

- ప్రమాదకరంగా రెడ్డిపేట -తుంపల్లి రోడ్డు
- తరుచూ ప్రమాదాలు
- రోడ్డు బాగు చేయాలని వాహనదారుల విన్నపాలు పట్టని అధికారులు



మలుపు వద్ద లేని సూచిక.. రోడ్డుపక్కన గుంత

నవతెలంగాణ-రామారెడ్డి

రామారెడ్డి మండలంలోని రెడ్డిపేట్ నుంచి సిరికొండ మండలం తూంపల్లి వరకు గల రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. రోడ్డు ఎత్తుగా ఉన్నప్పటికీ పక్కన మట్టి పోయకపోవడం, అనేక మలుపులు ఉండటంతో ప్రమాదకరంగా మారింది. కనీసం సూచిక బోర్డు సైతం లేక తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గత నెలలో ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొనడంతో, పలువురికి గాయాలయ్యాయి. బస్సులు, లారీల వంటి పెద్ద వాహనాలు వచ్చినప్పుడు, ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనదారులు రోడ్డు దిగితే గుంతల్లో ప్రమాదం చోటు చేసుకుంటుంది. రెండు ఎదురుగా పెద్ద వాహనాలు వచ్చినా ఇబ్బంది లను ఎదుర్కొంటున్నారు. మలుపుల వద్ద ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని , సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని, రోడ్డు ప్రక్కల గుంతల్లో మొరం వేసి చదును చేయాలని అధికారులను, ప్రజాప్రతినిధులను వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు మరమత్తుపై ఆర్ అండ్ బి ఏ ఈ సూర్య తేజను నవతెలంగాణ వివరణ కోరగా త్వరలో రోడ్డు పక్కన గల గుంతలను పూడ్చి చదను చేస్తామని తెలిపారు.

ఏకలవ్య ప్రవేశ పరీక్షలకు హాల్ టికెట్స్ డౌన్‌లోడ్ చేసుకోవాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఆరో తరగతికి ప్రవేశ పరీక్ష ఈ నెల 16న ఉంటుందని, దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఈ నెల 7 నుండి వెబ్ సైట్ ద్వారా హాల్ టికెట్లను డౌన్ లోడ్ చేసుకోవాలని ఇందల్వాయి, ఈఎంఆర్ఎస్ పాఠశాల ప్రిన్సిపాల్ రమేష్ కుమార్ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థినీ, విద్యార్థులు tsemrs.cgg.gov.in అనే వెబ్ సైట్ నుండి డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించారు.

ఇద్దరిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని భిక్కనూర్, మల్లుపల్లి గ్రామ శివారులో మద్యం సేవించి వాహనం నడిపిన ఇద్దరు వ్యక్తులపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై దత్తాద్రి తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసు నమోదు చేసి జరిమానా విధించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

హరితహారం ఫలం



నవతెలంగాణ-బోధన్

గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన హరితహారం కార్యక్రమం పలుచోట్ల సత్ఫలితాలనే ఇస్తున్నాయి. బోధన్ మండలం బెల్లాల్ గ్రామపంచాయతీ ఆవరణలో నాటిన హరితహారంలో భాగంగా ఆనాటి పాలకవర్గం మామిడి మొక్కలు నాటి సంరక్షించారు. దాంతో నేడు ఆ మామిడి మొక్కలు ఏపుగా పెరిగి పెద్ద పెద్ద చెట్లుగా మారి వాటికి మామిడి పండ్లు కాయడంతో గ్రామ పంచాయతీకి వచ్చిన వారు పండ్లను చూసి హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పన్ను వసుళ్ల పరిశీలన



నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్ ఆదివారం పన్ను వసూలు బృందాలను తనిఖీ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ దిలీప్ కుమార్ బిల్ కలెక్టర్, వార్డు అధికారులకు పలు సూచనలు చేశారు. ఇంకా కమిషనర్ దిలీప్ కుమార్ డివిజన్ నంబర్ 28 లో ఏరియా వార్డ్ అధికారితో కలిసి కొన్ని ఇళ్లకు వెళ్లి పన్నులు వసూలు చేశారు. పన్ను వసూలు బృందాన్ని ఎండల నుండి రక్షించడానికి తలపై క్యాప్ ధరించాలని మున్సిపల్ సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పొగాకుకు గిట్టుబాటు ధర వచ్చేనా?

- గత ఏడాది కంటే రెట్టింపైన సాగు ఖర్చు, కూలిరేట్లు

పొగాకు పండించిన రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. తక్కువ పెట్టుబడితో లాభం వస్తుందని పంట సాగు చేస్తే పెట్టుబడులు రెట్టింపయ్యాయి. కూలిరేట్లు, కౌలుధర, ఎరువుల ధరలు పెరగడంతో పెట్టుబడులు పెరిగిపోయాయి. మరో వైపు పొగాకు కంపెనీ వారు రైతులను సంప్రదించకపోవడంతో ధర నిర్ణయం కాలేదు. దీంతో పెట్టుబడి ఖర్చులైనా వెళ్తాయో..లేదో అని రైతన్నలు ఆందోళనకు గురవుతున్నారు. దిగుబడి బాగావచ్చి పొగాకు కంపెనీవారు గిట్టుబాటు ధర ఇస్తేనే గట్టెక్కుతామని వెళ్తాయని రైతులు అంటున్నారు.

నవతెలంగాణ-రెంజల్

తక్కువ పెట్టుబడి ఎక్కువ లాభం వస్తుందన్న ఆశతో రైతన్నలు పొగాకు సాగు వైపు మొగ్గు చూపారు. నేడు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలీల రేట్లు రెట్టింపు అవడంతో పెట్టుబడులు తడిసి మోపెడు అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాదికి, నేడు పొగాకు పండించిన రైతులకు రెట్టింపు ఖర్చులు అవుతున్నాయని వారన్నారు. రైతులు పొగాకు సేకరించి వాటిని దారంతో చుట్టడానికి 30ఉండగా నేడు 90 రూపాయలకు పెరిగిందన్నారు. సుమారు 100 తాడులను తయారు చేస్తేనే ఒక క్వింటాలు పొగాకు అవుతుందని వారు పేర్కొన్నారు. ఎకరానికి లక్ష20వేల నుంచి లక్ష 50వేల వరకు ఖర్చు అవుతుందని వారన్నారు. గత సంవత్సరం సుమారు 16 వందల ఎకరాలలో సాగు చేయగా ఈ ఏడాది సుమారు 2000 ఎకరాల వరకు సాగు చేశారు. పొగాకు సాగు చేసినప్పటి నుంచి పొగాకు మండె వేసేంతవరకు కూలీల రేటు గణనీయంగా పెంచారు. రోజు కూలికి 1000 రూపాయలను ఇవ్వడంతో పాటు, ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం మందు ఇవ్వవలసిన రావడంతో ఒక కూలికి 1500 రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోందని వారు తెలిపారు. పొగాకు ధర వజీర్ సుల్తాన్ టుబాకో కంపెనీ యాజమాన్యందే తుది నిర్ణయం అని రైతులు అంటున్నారు. గత సంవత్సరం క్వింటాలు ఏ గ్రేడ్ కు 13,500, బి గ్రేడ్ కు 13300, సీ గ్రేడ్ కు 12,100 రూపాయలను నిర్ణయించారు. ఈ ఏడాది కౌలు దారులు, ఎకరానికి 30 వేల రూపాయలు, డీఏపీ ధర పెరగడం, నాలుగు తడుల నీటిని అందించడం, కూలీల రేట్లు రెట్టింపు కావడం రైతుకు ఖర్చు రెట్టింపు అవుతుందని వారు పేర్కొంటున్నారు. గత ఏడాది నాలుగు కంపెనీల వారు పొగాకు కొనుగోలు చేయడంతో 11,200 ఉన్న పొగాకు ధర, 13,500 రూపాయలతో పాటు, ఏ గ్రేడ్ రైతులకు 300 రూపాయల బోనస్ ఇచ్చారు. ఈ ఏడాది ఇంతవరకు యాజమాన్యం రైతులను సంప్రదించలేదని వారు పేర్కొంటున్నారు. వజీర్ సుల్తాన్ టుబాకో యాజమాన్యం వచ్చి రైతులతో సంప్రదింపులు జరిపే వారని, ఇంతవరకు వారు రాకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎకరానికి లక్ష ఇరవై వేల రూపాయల ఖర్చు కాగా, పొగాకు దిగుబడి 10 నుంచి 12 క్వింటాళ్లు పండితేనే లాభం వస్తుందని వారన్నారు. ఈ ఏడాది ప్రతిసారి పండించే రైతులతో పాటు కూలి పని చేసే రైతులు సైతం భూములను కౌలుకు తీసుకొని పొగాకును పండించడం విశేషం. రైతులకు గిట్టుబాటు ధర లభించేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.



ఆరబెట్టిన పొగాకు



గిట్టుబాటు ధర వచ్చేలా చూడాలి
హర్షద్ పాషా, రైతు (బోర్గం)

మండలంలోని కందకుర్తి, పేపర్ మిల్, నీలా, బోర్గం గ్రామాలలో రైతులు ఈ పొగాకు పంటపై ఆధారపడి ఉన్నారని, వారికి యాజమాన్యం అనుకూలమైన గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటను మొత్తం కొనుగోలు చేయాలని ఆయన అన్నారు. కౌలు రైతులకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని యాజమాన్యాన్ని కోరుతున్నారు.

నష్టపోకుండా ధర నిర్ణయించాలి
చిరడి రవి, (బోర్గం)



ఆరుగాలం కష్టించిన పంటకు వజీర్ సుల్తాన్ టుబాకో కంపెనీ యాజమాన్యం ఆదుకోవాలి. గత సంవత్సరం కంటే రెట్టింపు పెట్టుబడులు అవుతున్నందున రైతులు నష్టపోకుండా ధర నిర్ణయం చేయాలి. కూలీల ధరలు విపరీతంగా పెరిగిపోవడం వల్ల పెట్టుబడుల పెరిగాయని ఆయన పేర్కొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానించిన ఉమెన్స్ హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఉమెన్స్ హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిజామాబాద్ లోని న్యూ ఎన్జీవోస్ కాలనీలో గల స్నేహ సొసైటీ స్కూల్లో 80మంది విద్యార్థులందరికీ అన్నదానం చేశారు. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఆయాలను సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి మాట్లాడుతూ.. విద్యార్థులకు బిస్కెట్లు, స్వీట్లు పంచడం ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో ఉమెన్స్ హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో సభ్యులు కలిసి నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ఉమెన్స్ హెల్పింగ్ హాండ్స్ సభ్యులు, మహిళా ఉపాధ్యాయినులు సిహెచ్. వరలక్ష్మి, సుచరిత, సునీత, సుజని, ప్రయాగ, ధనలక్ష్మి పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత



గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్న పోలీసులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని ఒకటవ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయిని పట్టుకున్నట్లు నిజామాబాద్ ఒకటవ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ రఘుపతి ఆదివారం తెలిపారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద నమ్మదగిన సమాచారం మేరకు వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ బి. రఘుపతి పోలీస్ ఒక బృందాన్ని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఏర్పాటుచేశారు. అనుమాదాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని పట్టుకొని అతని వద్ద ఉన్న బ్యాగ్ ని చెక్ చేయగా అందులో 250 గ్రాముల ఎండు గంజ పట్టుకొని విచారించారు. నవీపేట్ మండలం నాలేశ్వర్ గ్రామానికి చెందిన బీస ప్రవీణ్ ప్రస్తుత నివాసం ఎలవాత్ గ్రామం తానూర్ మండల్ నిర్మల్ జిల్లా అని తెలిపారు. ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. గంజాయి పట్టివేతలో కీలకపాత్ర పోషించిన ఎస్సై మొగులయ్య, సిబ్బందిని అధికారులు అభినందించారు.

లయన్ సహారా నిజామాబాద్ రీజియన్ చైర్మన్‌గా
లయన్ ఉదయ సూర్య భగవాన్

నవతెలంగాణ-కంఠేశ్వర్



నియామక పత్రం అందుకుంటున్న ఉదయ సూర్యభగవాన్

లయన్ ఇంటర్నేషనల్ 320డి కన్వెన్షన్ కార్యక్రమం రాసి కన్వెన్షన్ హైదరాబాద్లో హట్టహాసంగా ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లయన్స్ సహారా నుండి లయన్ ఉదయ సూర్య భగవాన్ రీజియన్ చైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రీజియన్ కోఆర్డినేటర్ గా నాగేశ్వరరావు, జోన్ చైర్మన్గా లయన్ నరసింహారావు, లయన్ ఆవన్ కుమార్, లయన్ భూమన్నలను నియమిస్తూ గవర్నర్ అమర్నాథ్ ఉత్తర్వులను అందజేశారు. రానున్న రోజుల్లో లయన్ సేవలను నగరంలో విస్తృతం చేస్తామని నూతనంగా లయన్ సహారా నుండి ఎన్నికైన సభ్యులు పేర్కొన్నారు.

పాఠశాలలో సైన్స్ డే, స్పోర్ట్స్ మీట్



బహుమతులు అందుకున్న విద్యార్థులు

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంలోని న్యూ హొరిజోన్స్ పాఠశాలలో శనివారం సాయంత్రం సైన్స్ డే, స్పోర్ట్స్ మీట్ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. గణతంత్ర దినోత్సవంలో భాగంగా నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన పాఠశాల విద్యార్థులకు బహుమతులను అందజేసినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రావిలాస్ ఆదివారం తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్సై తొగర్ల సురేష్ కుమార్, పీడి రాజ్ కుమార్, ప్రేమ్ కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రావిలాస్, కరస్పాండెంట్ రత్నాకర్, పాఠశాల అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కకు శుభాకాంక్షలు తెలిపిన వేణుగోపాల్ యాదవ్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మహిళ దినోత్సవం పురస్కరించుకొని పంచాయతీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్కకు టిపీసీసీ అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు శనివారం మంత్రి సీతక్కను తన నివాసంలో కలిసి మహిళ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీతక్కకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు.

అంతర్రాష్ట్ర చైన్ స్నాచర్ల అరెస్ట్

- 50 గ్రాముల బంగారం, బైక్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏసిపి రాజా వెంకట్ రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్



వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ

జల్సాలకు అలవాటు పడిన ఓ ముగ్గురు యువకులు దొంగతనాలను వృత్తిగా ఎంచుకొని చివరకు పోలీసులకు పట్టుబడ్డారు. నగరంలోని నాలుగవ పోలీస్ స్టేషన్ పరిధిలో చైన్ స్నాచర్ల ముఠాను అరెస్టు చేసి వారి వద్ద 50 గ్రాముల బంగారం, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు నిజామాబాద్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ రాజ వెంకట్ రెడ్డి తెలిపారు. శనివారం నగరంలోని ఏసీపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైన్ స్నాచింగ్ ముఠాకు సంబంధించిన వివరాలను ఎసిపి వెల్లడించారు. ధర్మాబాద్ రామ్ నగర్‌కు చెందిన షేక్ ఇమ్రాన్,శారద నగర్ బాసరకు చెందిన షేక్ ఆర్బాజ్, మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన ఆమన్ లు కలిసి నాలుగు చైన్ స్నాచింగ్ కేసులు, మూడు బైకు దొంగతనాలు, ఒక ఇంట్లో దొంగతనం కేసులు నమోదైనట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న సమయంలో ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోని శ్రీనగర్ కాలనీలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వీరిని పట్టుకున్నట్లు తెలిపారు. వీరిలో ఇద్దరిని అరెస్టు చేశామని ఒకరు పరారీలో ఉన్నారని, కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. చైన్ స్నాచింగ్ కేసులో నిందితులైన వీరిని పట్టుకోవడంలో చాకచక్యం ప్రదర్శించిన టౌన్ సిఐ శ్రీనివాస రాజు, సిసిఎస్ సిఐ సురేష్, ఫోర్త్ టౌన్ ఎస్‌హెచ్‌ఓ శ్రీకాంత్, సిబ్బందిలను అభినందించారు. సిబ్బందికి రివార్డ్ కోసం పైఅధికారులకు రికమండ్ చేస్తున్నట్లు తెలిపారు.

డ్రగ్స్ నియంత్రణ పోస్టర్లు ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆర్మూర్

యాంటీ నార్కోటిక్స్ బ్యూరో తెలంగాణ వారు డ్రగ్స్ నియంత్రణ కోసం రూపొందించిన అవగాహనా పోస్టర్స్ పట్టణ సామాజిక సేవకులు పట్వారీ తులసి కుమార్, అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏసిపి వెంకటేశ్వర్ రెడ్డి , రూరల్ సీఐ శ్రీధర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. మద్యపానం వివిధ చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలన్నారు. నేటి విద్యార్థులు, యువత, ప్రజలు ప్రతి ఒక్కరూ మంచి అలవాట్లతో ఆలోచనలతో ముందుకు సాగాలని దేశ భవిష్యత్తుకు యువతరం తోడ్పడాలని తెలిపారు. డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటిని నిరోధించడానికి తమ సహకారం ప్రజలకు ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన సామాజిక సేవకుడు తులసి సేవలు వారి అవగాహన నైపుణ్యశైలి అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా తులసి కుమార్ మాట్లాడుతూ.. ఉన్నతమైన చదువును చదివి దేశ భవిష్యత్తుకు తోడ్పడాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఏసీపీ, సీఐతో కలిసి పోస్టర్లు ఆవిష్కరిస్తున్న తులసి పట్వారి

కాంగ్రెస్ నేత భూకబ్జాపై ఇంటెలిజెన్స్ ఆరా..!

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగర శివారులోని బోర్గం(పి) గ్రామంలో కాంగ్రెస్ నేత కబ్జా చేసిన ప్రభుత్వ భూమిపై ఇంటెలిజెన్స్ విచారణ చేపట్టినట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సందగిరి భూమ్ రెడ్డి మరో ఇద్దరితో కలిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సమీపంలో గల ప్రభుత్వ భూమిని కబ్జా చేసినట్లు కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు గత కొంతకాలంగా భూ కబ్జాపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్న స్పందించకపోవడంతో లోకాయుక్తను ఆశ్రయించారు. అదేవిధంగా సీసీఎల్ఏ కమిషనర్ కు ఫిర్యాదు చేయడంతో ఎట్టకేలకు అధికారులు స్పందించారు. గత సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు ప్రభుత్వ భూమి కబ్జాపై పూర్వ విద్యార్థులు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. బోర్గం గ్రామంలోని 586 /1/2 సర్వే నంబర్ లో గల 1.21 ఎకరాల భూమిని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థుల ఆటస్థలం కోసం కేటాయించాలని దశబ్ద కాలంగా గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు పోరాడుతున్నారు. గతంలో పనిచేసిన కలెక్టర్ తో పాటు రాష్ట్రస్థాయి అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు చేశారు. ఫిర్యాదులపై అప్పట్లో స్పందించిన అధికారులు కాంగ్రెస్ నేత కబ్జా చేసిన భూమిని గుర్తించి ప్రభుత్వ భూమి అంటూ సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. అయితే అధికార బలంతో భూమ్ రెడ్డి, ఆయన మేనల్లుడు బీజేవైఎం నేత , మరో వ్యక్తి కలిసి రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన ప్రభుత్వ సూచిక బోర్డును తొలగించినట్టు ఫిర్యాదులో తెలిపారు. సాధారణ వ్యక్తులు ప్రభుత్వ భూమిలో పాగా వేస్తే తక్షణమే స్పందించి చర్యలు తీసుకునే అధికారులు అధికార పార్టీ నేతపై భూకబ్జా ఆరోపణలు వస్తే ఎందుకు స్పందించడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అయితే అధికారుల తీరును నిరసిస్తూ పట్టు వదలకుండా పూర్వ విద్యార్థులు ప్రభుత్వ భూమిని కాపాడేందుకు చేస్తున్న ప్రయత్నాల పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం సీరియస్ గా స్పందించి కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడి, విద్యార్థులకు అవసరమైన క్రీడ స్థలానికి స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇంటిలిజెన్స్ ఆరా తర్వాత ప్రభుత్వం స్పందించి భూ కబ్జాదారులపై చర్యలు ఉంటాయా..? లేదా..? అన్నది వేచి చూడాల్సిందే. ఇప్పటికే రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన సూచిక బోర్డుపై స్పష్టంగా రాశారు. ఇది ప్రభుత్వ స్థలమని దీనిని ఎవరైనా కబ్జా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన కబ్జాదారులు మాత్రం ఇవేవీ తమకు పట్టనట్లు బోర్డును తొలగించడం వారి బరితెగింపుకు నిదర్శనంగా నిలిచింది. కోట్ల రూపాయల విలువైన ఎకరం 21 గుంటల స్థలం కబ్జాకు గురైతే ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడం పై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పాఠశాలకు అటస్థలం ఇచ్చే వరకు తమపోరాటం కొనసాగుతుందని పాఠశాల పూర్వ విద్యార్థులు అంటున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడుదాం

ఐఎఫ్‌టీయు
నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దృఢంగా పోరాడుదాం అని నిజామాబాద్ ఐఎఫ్‌టీయు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భూమన్న, దాసు కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. 2 ఆదివారం నిజామాబాద్ నగరంలోని ద్వారకానగర్ ఐఎఫ్‌టీయు ఆఫీసులో జిల్లా కమిటీ సమావేశం అనంతరం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూమన్న దాసులు మాట్లాడుతూ.. నరేంద్ర మోడీ అనేక వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని వారన్నారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మికులకు మరణ శాసనం విధించిందని వారు తెలిపారు. వ్యవసాయ వ్యతిరేక మూడు నల్ల చట్టాలను తెచ్చి రైతాంగాన్ని బలిపీఠం ఎక్కించిందని వారు తెలిపారు. ప్రతి ఏటా రెండు కోట్ల కొలువుల మాట నీళ్ల మూట అయిందని, పేద కుటుంబానికి 15 లక్షల జమ హామీ అడ్రస్ లేకుండా పోయిందని వారు తెలిపారు. భేటి బచావో బేటి పడావో అని నిర్ణయిస్తున్న నరేంద్ర మోడీ మహిళా మల్లా యోధులను లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీపై ఎందుకు చర్య లేదని వారు ప్రశ్నించారు. ప్రభుత్వ రంగ సంస్థలను బహిరంగంగా వేలం వేస్తూ అంబానీ ఆదాని లాంటి పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తున్నారని వారు ఆరోపించారు. సుస్థిర పాలన పేరుతో ప్రతిపక్ష పార్టీలను అస్థిరం చేస్తున్న మోడీ పాలన ఎమర్జెన్సీని మర్పిస్తోందని వారన్నారు. స్వదేశీ జపం చేసిన వాళ్ల విదేశీ విధానాలతో ముందుకు పోవడం విడ్డూరంగా ఉందని వారు అన్నారు. ఎన్నికల వాగ్దానాలను అమలు చేయమంటే అక్రమ నిర్బంధాన్ని కొనసాగించి ప్రజాస్వామ్య విలువలను పాతరేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఐఎఫ్‌టీయు జిల్లా ఉపాధ్యక్షులు బి సూర్య శివాజీ మాట్లాడగా ఐఎఫ్టియు నాయకులు శివకుమార్, అబ్దుల్, జేపీ గంగాధర్, మోహన్, పోశెట్టి, భారతి, రాజు, మురళి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయు నాయకులు

క్రికెట్ దుస్తుల వితరణ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని కలిగోట్ గ్రామంలోని యువకులకు కాంగ్రెస్ డిసిసి మాజీ కార్యదర్శి కలిగోట్ మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్ క్రికెట్ దుస్తువులను ఆదివారం అందజేశారు. గ్రామంలోని 20మంది యువకులకు 20 క్రికెట్ దుస్తులను అందజేశారు.



క్రికెట్ దుస్తులు అందజేసిన మాజీ ఉపసర్పంచ్

నవతెలంగాణ
కామారెడ్డి
3
సోమవారం | మార్చి 10, 2025 | www.navatelangana.com

ప్రధానోపాధ్యాయునికి సన్మానం



నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట మండలంలోని ఐలాపూర్ ప్రాథమిక ఉచ్చతర పాఠశాల ప్రధానోపాధ్యాయులు దామోదర్‌ను ఆదివారం జిల్లా కేంద్రంలో అవార్డు టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కామారెడ్డిలో ఎ. టి. ఎ (అవార్డీ టీచర్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో అయిలాపూర్ ప్రాథమిక పాఠశాల, లింగంపేట్ ప్రధానోపాధ్యాయుడు దామోదర్ దంపతులను శాలువాతో సన్మానించి, జ్ఞాపికను, ప్రశంసా పత్రం బహుకరించారు. 2024 సంవత్సరంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన 24 మందికి సన్మానించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆంజనేయ శర్మ ఉపాధ్యాయుల సామాజిక బాధ్యత లను గుర్తు చేశారు.

చిన్ననాటి మిత్రుని కుటుంబానికి ఆర్థిక సహాయం



నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని ఇసన్నపల్లికి చెందిన సిద్ధం బైరయ్య అకాల మరణం చెందిగా, బాధిత కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నదని తెలుసుకున్న చిన్ననాటి మిత్రులు బాధిత కుటుంబానికి ఆదివారం రూ పదివేలు, 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో చిన్ననాటి మిత్రులు డాక్టర్ సుధాకర్, దోమల శ్రీధర్, భూపతి నాగరాజు, కాముని కృష్ణ, గురజాకుంట స్వామి, మహేందర్, రామస్వామి, మహేందర్, రవి, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన బీటీ రోడ్డు పనులు

- సిద్దాపూర్, మైబాపూర్ గ్రామస్తులకు తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని ఆర్అండ్‌బీ అధికారులు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని మైబాపూర్ గ్రామానికి బీటీ రోడ్డు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. అయినా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదు. గత ప్రభుత్వ హయంలో ప్రారంభమైన పనులు.. ఇంకా పూర్తికాలేదు. ఈ ప్రభుత్వమైనా పనులను పూర్తి చేయాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



కంకరపోసి వదిలేసిన రోడ్డు

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ఎన్నికల ముందు హడావిడిగా సిద్దాపూర్ నుంచి మైబాపూర్ వరకు మూడు కిలోమీటర్ల బీటీ రోడ్డు మంజూరు చేశారు. రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో అంచనా విలువ రెండు కోట్ల నలభై లక్షలు మంజూరు చేశారు. ఈ రోడ్డు పనులకు నాటి రోడ్లు భవనాల శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే హనుమంత్ షిండేతో కలిసి 21.06.2023వ తేదీన ప్రారంభించారు. ఎలాగైనా బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందనే అత్యాశతో నాటి ప్రభుత్వంలోని నాయకుల మాటలు విని అధికారులు, గుత్తేదారుడు పనులను చకచకా చేస్తూ రోడ్డును అభివృద్ధి చేసే నిమిత్తం ఎక్కడ పడితే అక్కడ రోడ్డును తోడేశారు. ఎక్కడికక్కడ సరిచేయకుండా వదిలేశారు. రోడ్డు పనులకు అవసరమైన మెటీరియల్ కూడా రోడ్డు పనుల వద్ద నిల్వ ఉంచారు. అంతలోనే ఎన్నికల కోడ్ రావడంతో నిధులు వస్తాయో రావో అని గుత్తేదారుడు వెనుకడుగు వేసి పనులను నిలిపేశాడు. అనంతరం అసెంబ్లీ ఎన్నికలు జరగడంతో ఎంతో ఆశతో మళ్లీ బి.ఆర్.ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందనుకున్నా.. ఎన్నికల ఫలితాలను చూసి అవాక్కయ్యారు. దీంతో అభివృద్ధి పనులు అక్కడే మధ్యంతరంగా నిలిచిపోయాయి. అందులో భాగంగానే సిద్దాపూర్ నుంచి మైబాపూర్ వరకు మూడు కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు వేయడానికి పూనుకున్నప్పటికి బీటి రోడ్డు పనులు ప్రారంభించినా.. నేటికీ బీటీ రోడ్డు వేయకపోవడం పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో ఆ గ్రామాలకు వెళ్లే ప్రయాణికులకు ద్విచక్ర వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా అధికారులు గ్రామాలను సందర్శించాలంటే రోడ్లు బాగుండాలి. అందుకు రోడ్డు



రోడ్డు పనుల వివరాలతో కూడిన శిలాఫలకం

ప్రయాణ సౌకర్యాలు అనుకూలంగా లేకపోవడంతో అక్కడ విద్య బోధన చేసే ఉపాధ్యాయులు, ఇతర అధికారులకు కూడా ఈ రోడ్డు సమస్య వారికి అడ్డంకిగా మారింది. నిత్యం దుమ్ము, దూళీ రోడ్డుపై వ్యాపించడంతో ప్రయాణికులు శ్వాసకోశ వ్యాధులతో ఆసుపత్రి పాలవుతూ అనారోగ్యానికి గురవుతున్నారు. దుమ్ము దూళీ లేవకుండా నీటిని పట్టాల్సిన గుత్తేదారుడు పట్టించుకోకపోవడం వలన ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దున ఉన్న మైబాపూర్ గ్రామం అక్కడి నుంచి ఇరు రాష్ట్రాల ప్రజలు రాకపోకలు బాగానే జరుగుతాయి. ఏళ్ల తరబడి గ్రామానికి బస్సు వస్తుందని ఆశతో ఉన్న గ్రామస్తులకు నిరాశే ఎదురవుతూ వస్తుందని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి అర్ధాంతరంగా నిలిచిపోయిన సిద్దాపూర్ - మైబాపూర్ బీటీ రోడ్డు పనులను పున:ప్రారంభించి పూర్తిచేయాలని కోరుతున్నారు. బీటీ రోడ్డు వేసి మైబాపూర్ గ్రామ ప్రజల చిరకాల వాంఛను నెరవేర్చాలని గ్రామస్తులు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావును కోరుతున్నారు.

మానవత్వంతో రక్తదానం

నవతెలంగాణ-కామారెడ్డి

రక్తం పొలంలో పండేది కాదు.. తయారు చేసేది అంతకన్నా కాదు.. మానవత్వంతో మరొక మనిషికి రక్తం పంచడమే రక్తదానం అని జిల్లా రక్తదాతల సేవాసమితి నిర్వాహకులు బోనగిరి శివకుమార్, ముదం శ్రీధర్ పటేల్ ఆదివారం అన్నారు. కామారెడ్డి జిల్లాలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మంగళి లలిత అనే మహిళకి అత్యవసరంగా ఆపరేషన్ నిమిత్తమై బి పాజిటివ్ రక్తం అవసరం కావడంతో వారి కుటుంబ సభ్యులు జిల్లా రక్తదాతల సేవా సమితిని సంప్రదించగా.. వారి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రానికి చెందిన నాగసాయి సహకారంతో వారికి కావాల్సిన బి పాజిటివ్ రక్తం అందజేసినట్టు తెలిపారు.

వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కామారెడ్డి వాసి

నవతెలంగాణ-కామారెడ్డి



వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర కమిటీలో కామారెడ్డి జిల్లా వాసుకి చోటు దక్కడంపై జిల్లా అధ్యక్షుడు బాలరాజు గౌడ్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. అంతర్ జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వికారాబాద్ జిల్లాలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు బాలరాజ్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు సుజాత సూర్య వంశీ కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండల కేంద్రానికి చెందిన నల్లభల్ల సుజాతను రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా నియమించారు. ఆమెకు జిల్లా కమిటీ తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులను సన్మానించి జ్ఞాపిక అందజేసిన పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని పోల్కంపేట గ్రామంలో ఆదివారం 2008 - 2009 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు నాటి ఉపాధ్యాయులతో కలిసి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చిన్ననాటి తీపి జ్ఞాపకాలను నాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం విద్యార్థులు ఏ స్థాయిలో ఉన్నారు వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నాటి ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు ఎంత ఉన్నత స్థాయికి వెళ్తే ఉపాధ్యాయులకు అంత సంతోషం అన్నారు. ప్రతి విద్యార్థిని తమ జీవితంలో ఉన్నత స్థాయిలో స్థిరపడాలని ఉపాధ్యాయులు కోరుకుంటారన్నారు. పాము సుమారు 15 సంవత్సరాల తర్వాత మళ్లీ పోల్కంపేట్ స్కూల్‌కు వచ్చి పిల్లలందరిని కలవడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. అనంతరం ఉపాధ్యాయులు మాణిక్య రెడ్డి, రవీందర్, దామోదర్, మంజుల, పద్మ, నాటి అటెండర్ భాగయ్యను పూర్వ విద్యార్థులు శాలువా పూలమాల మెమొంటతో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అజయ్ గౌడ్,సామ్రాట్, ఎల్లేశం, శ్రీనివాస్, రాజలింగం, రాజు, సంతోష్, అశోక్, మోహన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అధైర్యపడవద్దు.. అండగా ఉంటా



బీమాచెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-లింగంపేట్

అధైర్య పడవద్దు అన్ని విధాలుగా అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఆదివారం లింగంపేట్ మండలంలోని బానాపూర్ గ్రామ బిఆర్ఎస్ పార్టీ క్రియాశీల కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించారు. బాణాపూర్ గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త ఆళ్ల బాలయ్య ప్రమాదవశాత్తు గత సంవత్సరం మరణించారు. మృతుడు బిఆర్ఎస్ పార్టీలో క్రియాశీల సభ్యత్వం ఉంది. పార్టీ ఇన్సూరెన్స్(2 లక్షల) చెక్కును మృతుని కుటుంబం ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. పార్టీ అండగా ఉంటుందని అన్ని విధాలుగా ఆదుకుంటానని కుటుంబానికి ఆయన భరోసా కల్పించారు. ఆయన వెంట బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దివిటి రమేష్ మాజీ ఎంపీపీ ముద సాయిలు గ్రామ కమిటీ అధ్యక్షుడు దాసరి సాయిరెడ్డి, బిఆర్ఎస్ నాయకులు నర్సింలు, గన్ను నాయక్, కళా సూర్య వర్ధన్ రవి మధుసూదన్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండలంలోని పోచారం గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేసినట్లు కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు వేముల కిరణ్ తెలిపారు. గ్రామానికి చెందిన కళాలి రామవ్వకు 50 వేల రూపాయల చెక్కును అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రమేష్, నర్సాగౌడ్, ఆసిఫ్, దాసు, కర్రోళ్ల శ్రీను పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



కళ్యాణలక్ష్మి చెక్కు అందజేత

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండలంలోని పోచారం తాండూర్ గ్రామాలలో ఆదివారం కాంగ్రెస్ నాయకులు లబ్దిదారుల ఇంటికి వెళ్లి కళ్యాణలక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి, వేముల కిరణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంగయ్య, మధు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డుల కోసం తిప్పలు

- చేర్పులూ మార్పుల్లోనూ చిక్కులు
- ఆన్‌లైన్ ప్రక్రియలో ఇక్కట్లు

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)

అర్హులందరికీ రేషన్ కార్డులు ఇస్తానని రాష్ట్ర ముఖ్యమంత్రి హామీ ఇవ్వడంతో కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుకు కోటి తిప్పలు పడాల్సి వస్తోంది. ఆన్‌లైన్ ప్రక్రియ ఆలస్యమవుతోంది. రేషన్‌కార్డుల దరఖాస్తుదారులు, పాత కార్డుల్లో చేర్పులు, మార్పుల కోసం మీ సేవ కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. మీ సేవ కేంద్రాల్లో అప్లికేషన్‌తో పాటు కుటుంబ సభ్యులందరి ఆధార్‌కార్డులు, చిరునామాకు సంబంధించి ఓటర్ ఐడీ లేదంటే కరెంట్ బిల్లు, ఇంటి పన్ను వంటి ధ్రువీకరణల జిరాక్సులు తీసుకుంటున్నారు. ఆన్‌లైన్‌లో పూర్తి వివరాలు పొందుపరుస్తున్నారు. ఇదంతా చేసి సబ్మిట్ చేశాక సర్వర్ డౌన్ లేదంటే ఆన్‌లైన్ ఎర్రర్.. ఇలాంటి సమస్యలు వస్తూ గంటల తరబడి ప్రక్రియ పూర్తి కావటం లేదు.

జాడలేని గ్రామసభలో దరఖాస్తులు..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి గ్రామంలో గ్రామ సభలు నిర్వహించి కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులను స్వీకరించింది. ఎన్నో ఏండ్ల నుంచి రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న లబ్దిదారులు గ్రామ సభలో దరఖాస్తు చేసుకున్నారు. అర్జీలు పెట్టి నెలలు గడుస్తున్నా వాటి పరిష్కారం మార్గం కనిపించకపోవడంతో తమ దరఖాస్తులు ఎటు వెళ్లాయంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

బాన్సువాడ డివిజన్ పరిధిలోని బీర్కూర్ మండలంలో నిర్వహించిన గ్రామసభలో 779 దరఖాస్తులు చేసుకోగా, నసురుల్లాబాద్ మండలంలో నిర్వహించిన గ్రామసభల్లో 1514 దరఖాస్తులు వచ్చాయి. అలాగే బాన్సువాడ మండలం బాన్సువాడ మున్సిపాలిటీ కలిపి మొత్తం 4500



దరఖాస్తులు వచ్చాయి. వచ్చిన దరఖాస్తు ఫారాలను తహసీల్దార్ కార్యాలయాల్లో ఎక్స్ఎల్ షీటులో ఫీడ్ చేసి జిల్లా అధికారులకు పంపినట్లు వివిధ తహసీల్దార్లు తెలిపారు. కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులకు రేషన్ బియ్యం వస్తాయా, లేక మళ్లీ దరఖాస్తు చేసుకోవాలా అంటూ ప్రజలు ఆందోళనలో ఉన్నారు.

ఆధార్ నంబర్‌తో అప్లికేషన్‌కు అర్హత నిర్ధారణ..

మీసేవ కేంద్రాల్లో అప్లికెంట్ పేరు, ఆధార్ నంబర్ ఇవ్వగానే ఆన్‌లైన్‌లో చెక్ చేస్తున్నారు. దరఖాస్తు చేసుకోవచ్చని సూచిస్తేనే అప్లికేషన్ తీసుకుంటున్నారు. గతంలో ఫ్యామిలీ మెంబర్‌గా తెలంగాణ ప్రభుత్వ రేషన్‌కార్డులో నమోదై ఉంటే కొత్తకార్డు దరఖాస్తును ఒక్కోసారి ఆన్‌లైన్ ఆమోదించట్లేదు. కారణమేంటో మీసేవ కేంద్రాల నిర్వాహకులు చెప్పట్లేదు. తహసీల్దార్ కార్యాలయానికి వెళ్తే అక్కడా సరైన సమాధానం రావట్లేదు. వివిధ ప్రభుత్వ పథకాలకు రేషన్‌కార్డునే ప్రామాణికంగా తీసుకోవడంతో లక్షలాది మంది కొత్త కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వం పదేండ్ల కిందట కొద్దిమందికి కార్డులు ఇచ్చి చేతులు దులుపుకుంది. ప్రస్తుత ప్రభుత్వం నిరంతర ప్రక్రియ పేరుతో ఇబ్బందులు పెడుతుండటంతో ప్రజల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్రజాపాలనలో దరఖాస్తులు, వాటి ఆన్‌లైన్ ప్రక్రియలో దొర్లిన తప్పుల కారణంగా జనవరి 26 తర్వాత ప్రకటించిన అర్హుల జాబితాలో అనేక లోపాలు వెలుగుచూశాయి. మళ్లీ మీసేవల్లో దరఖాస్తు చేసుకోవాలనటం.. ఆన్‌లైన్ ఇక్కట్లు ఎదురవుతుండటంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది.

చేర్పులు.. మార్పుల్లోనూ సమస్యలు..

పాత కార్డుల్లోని ఫ్యామిలీ మెంబర్ల చేర్పులు మార్పులకూ ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. కానీ వాటి ఆన్‌లైన్ విషయంలోనూ చిక్కులు ఏర్పడుతున్నాయి. ఈ పదేండ్లలో వివాహలై అనేక మంది వేర్వేరు కార్డుల్లో ఫ్యామిలీ మెంబర్లుగా ఉన్నారు. వారిని ముందుగా వాటిలో నుంచి తొలిగించిన తర్వాతే కొత్త కార్డు దరఖాస్తును ఆన్‌లైన్‌లో ఆమోదించే పరిస్థితి ఉంది. కుటుంబ సభ్యుల్లో ఎవరైనా మరణిస్తే మళ్లీ అదే తతంగం.

వివిధ గ్రామాల్లో అధికారులు వెల్లడించిన జాబితాపై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. చాలాచోట్ల బీఆర్ఎస్ అధికారంలో ఉండగా గ్రామ, మండల స్థాయిలో అధికారులతో సత్సంబంధాలున్న నేతల సూచన మేరకే ఎంపికలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో జాబితాలో పేర్లు రానివారు, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారికి మళ్లీ అర్జీలు పెట్టుకునే అవకాశం కల్పించారు. గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా ఆన్‌లైన్ ప్రక్రియ చేపట్టారు. ఈ ప్రక్రియ ముగిసిన తర్వాత అర్హులు ఎవరనేది తేల్చనున్నారు. రేషన్‌కార్డులపై నెలకొన్న సమస్యలపై సివిల్ సప్లయ్ అధికారులను ప్రశ్నిస్తే ప్రభుత్వ మార్గదర్శకాలకనుగుణంగా ఎంపికలు జరిగాయని చెబుతుండటం గమనార్హం.

చోరీ ఘటనలపై నియంత్రణేది..?

నవతెలంగాణ-తాడ్వాయి



విచారిస్తున్న ఏఎస్ఐ కొండల్ రెడ్డి (ఫైల్)

గ్రామాల్లో దొంగల బీభత్సంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. తాళం ఇండ్లే టార్గెట్‌గా దోపిడీ దొంగలు రెచ్చిపోతున్నారు. దీనికి తోడు చీకటి పడగానే ఎక్కడ ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. చోరీలు జరిగిన సమయంలోనే పోలీసులు బందోబస్తు నిర్వహిస్తే పెట్రోలింగ్ చేస్తున్నారని, తర్వాత పట్టించుకోవడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇందుకు నిదర్శనం వారం రోజుల క్రితం మండల కేంద్రంతో పాటు బ్రాహ్మణపల్లి లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడటం. చోరీలు జరిగి వారం రోజులు గడిచిన పోలీసులు దర్యాప్తు చేస్తున్న కేసుల వివరాలు కొలిక్కి రావడంలేదని ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. వారం రోజుల్లో రెండు కేసుల్లో రూ.3.20 లక్షల నగదుతో పాటు ఐదు తులాల బంగారం, 20 తులాల వెండి ఆభరణాలు పోయిన వాటి రికవరీలో మాత్రం పురోగతి కనిపించ కపోవడం గమనార్హం.

రాత్రి వేళలో గుర్తుతెలియని వ్యక్తులు సంచరిస్తున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఒక వేళ పెట్రోలింగ్ నిర్వహిస్తే.. ఇలాంటి ఘటనలు తగ్గే అవకాశం ఉంటుందని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు దోపిడీ దొంగల ఆటకట్టించి చోరీకి గురైన సొత్తును రికవరీ చేయించి బాధితులకు న్యాయం చేయాలని మండల వాసులు కోరుతున్నారు. అదే విధంగా పెట్రోలింగ్ ముమ్మరం చేసి ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విచారణ కొనసాగుతోంది

తాడ్వాయి ఎస్సై వెంకటేశ్వర్లు



చోరీ కేసుల్లో దొంగలను పట్టుకునేందుకు మా కోణంలో విచారణ చేపట్టాం. ఇది వరకే వేలిముద్రలు సేకరించ పరీక్షలకు పంపించాం. వాటి రిపోర్ట్ ఆధారంగా దొంగలను గుర్తించే పనిలో ఉన్నాం. వారిని పట్టుకొని చోరీ చేసిన నగదు బంగారు వెండి ఆభరణాలు రికవరీ చేసి కోర్టుకు సమర్పించి బాధిత కుటుంబాలకు న్యాయం చేస్తాం.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఒక్కచోట చేరిన పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని పెద్ద మల్లారెడ్డి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1986-87 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్నా పూర్వ విద్యార్థులు 38 సంవత్సరాల తర్వాత ఆది వారం ఒకచోట చేరి ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహిం చుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పాఠశాలలో చదువుకున్న జ్ఞాపకాలను గుర్తు చేసుకొని విద్యాబోధన చేసిన గురువులను శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర శర్మ, రవీందర్ గౌడ్, మాధవరెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

భారత క్రికెట్ టీం విజయం పట్ల సంబరాలు

నవతెలంగాణ-ఆర్మూర్

చాంఫియన్ ట్రోఫీ ఫైనల్‌లో న్యూజిలాండ్‌పై భారత క్రికెట్ జట్టు గెలుపొందడం పట్ల ఆదివారం రాత్రి పట్టణంలో టపాసులు కాల్చి సంబరాలు నిర్వహించుకున్నారు. దుబాయ్ వేదికగా జరిగిన చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్ అత్యంత ఉత్కంఠ భరితంగా సాగిన పోరులో భారత్ జట్టు 4 వికెట్ల తేడాతో కివీస్‌పై విజయం సాధించింది. కెప్టెన్ రోహిత్ శర్మ 76, శ్రేయాస్ అయ్యార్ 48, శుభమన్ గిల్ 31 పరుగులతో రాణించారు. ఇండియా జట్టు గెలుపుతో టీమ్ ఇండియా అభిమానులు పట్టణంతో పాటు మామిడిపల్లి, పెర్కిట్‌ల యందు సంబరాల్లో మునిగితేలారు.

సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెడ్ కానిస్టేబుల్ రవీందర్ అన్నారు. ఆదివారం రోజున మండల కేంద్రంలోని మహాత్మా గాంధీ చౌరస్తా వద్ద పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక గ్రామ ప్రజలకు డ్రగ్స్ నిర్మూలన, డ్రింక్ అండ్ డ్రైవ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగ మాట్లాడుతూ ఆన్‌లైన్ మల్టీ లెవెల్ మార్కెటింగ్ పేరుతో రోజురోజుకు సైబర్ మోసాలు పెరిగిపోతున్నాయి అన్నారు. తక్కువ పెట్టుబడి ఎక్కువ లాభాలు అంటూ మోసపూరిత ప్రచారాలతో ప్రజలను బూరడీ కొట్టిస్తున్నారని, ఇటువంటి ప్రచారాల పట్ల అప్రమత్తంగా, జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈజీ మనీ ఆశలో పడి మోసపోవద్దని సూచించారు. కొన్ని గంటల్లో, ఒక్క రోజులోనే, వారం రోజుల్లోనే రెట్టింపు నగదు ఇస్తామంటూ ఆన్ లైన్ ట్రేడింగ్ లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయంటూ ఎరవేస్తూ సైబర్ మోసగాళ్లు కుచ్చుటోపి పెడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది కానిస్టేబుల్ సాయిశివ, హెూంగార్డులు అంజి, శ్రీనివాస్, సంజీవ్ రెడ్డి, జైపాల్ పాల్గొన్నారు.

ఆర్య క్షత్రియ సంఘం కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన కార్యవర్గం

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని చిట్యాల గ్రామం ఆర్య క్షత్రియ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘ సభ్యులు అంబీర్ నరేందర్ రావు తెలిపారు. అధ్యక్షులుగా ఎండిగే విట్టల్ రావు, ఉపాధ్యక్షులుగా నిష్యం కిషన్ రావు, ప్రధాన కార్యదర్శిగా దేవునిపల్లి భీమ్రావు, కోశాధికారిగా అరాలి బాపూరావు, లను మాజీ కార్యవర్గ సభ్యులు నెట్టు మనోహర్‌రావు, లక్ష్మణరావును ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం ఎన్నికైన సభ్యులకు అంబీర్ నరేంద్రరావు ఆధ్వర్యంలో గత కార్యవర్గ నూతన కార్యవర్గ సభ్యులకు సన్మానం కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
సోమవారం | మార్చి 10, 2025 | www.navatelangana.com

పేద ముస్లింలకు దుస్తుల పంపిణీ



నవతెలంగాణ-పోతంగల్

మండలంలోని జల్లాపల్లి గ్రామంలో రంజాన్ సందర్భంగా ఆదివారం సామాజిక సేవకుడు హకీమ్, 120 మంది పేద ముస్లిం మహిళలకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హకీమ్ మాట్లాడుతూ.. పుట్టిపెరిగిన ఊరిలో పేద ముస్లింలకు తనవంతు సేవచేశానని అన్నారు. రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాగయ్య టీచర్, ఎజాజ్ ఖాన్, షేరు, రాములు, మిర్చి బాబు, పాషా, హబీబ్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని కలిగోట్ గ్రామంలో గల సిద్ధార్థ పాఠశాలలు ఘనంగా మహిళ అంతర్జాతీయ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. సిద్ధార్థ పాఠశాలలోగల అన్ని తరగతుల విద్యార్థులు వారి తల్లిదండ్రులతో ఘనంగా మహిళ అంతర్జాతీయ దినోత్సవం వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా అంతర్జాతీయ దినోత్సవం గురించి పలువురు ప్రముఖుల మహిళా దినోత్సవం గురించి వివరించారు. జిల్లాలో ఎవరు చేయనటువంటి ఈ సిద్ధార్థ పాఠశాల యజమాన్యం విద్యార్థులు వారి తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. సిద్ధార్థ పాఠశాల యజమానిని శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కోనాపూర్ పాఠశాలలో ఏఐ పాఠాలు

- ఎంఈవో ఆంధ్రయ్య

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



మండలంలోని మారుమూల గ్రామమైన కోనాపూర్ లోని ప్రాథమిక పాఠశాల ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ భోదన కు ఎంపికైందని మండల విద్యాధికారి నేర ఆంధ్రయ్య ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఫ్ఎల్ ఎస్ కార్యక్రమం ద్వారా తెలుగు, ఆంగ్ల, గణిత పాఠాలను విద్యార్థులు కంప్యూటర్ల ద్వారా నేర్చుకునే అవకాశం ఏర్పడిందని అన్నారు. తక్కువ సమయంలోనే విద్యార్థులకు నాణ్యతతో కూడిన ఇంటరాక్టివ్ పాఠాలు నేర్చుకునేందుకు ఈ సౌకర్యం ఉపయోగ పడుతుందని తెలిపారు. కోనాపూర్ పాఠశాల ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాఠాల భోదనకు ఎంపిక కావడం సంతోషకరమైన విషయమని, ప్రభుత్వ పాఠశాలలో అందుతున్న అనేక రకాల సౌకర్యాలు వినియోగించుకోవడం ద్వారా ఉత్తమ విద్యను పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని కోనాపూర్‌తోపాటు చుట్టు ప్రక్కల వారు ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. కోనాపూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ రాంప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అన్ని రకాలుగా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తమ ఉన్నత పాఠశాలలోని కంప్యూటర్ ల ద్వారా విద్య అందించగలమని తెలిపారు. విద్యార్థుల అవకాశాన్ని అందిపుచ్చుకొని విద్యలో ప్రపంచంతో పోటీపడాలన్నారు.

విగ్రహ ప్రతిష్టాపనకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

నవతెలంగాణ-ఆర్మూర్

మాక్లూర్ మండలం గుంజలి గ్రామస్తులు ఆదివారం ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డిని అంకాపూర్ గ్రామంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గుంజలి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ రామాలయం విగ్రహ ప్రతిష్టాపన మహెూత్సవానికి రావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో పెద్దమనుషులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్టాపన మహెూత్సవంలో...

మోర్తాడ్ మండలంలోని ధర్మోరా గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి విగ్రహ ప్రతిష్టాపన మహెూత్సవం 3 రోజులుగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో స్వామివారిని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కంచెట్టి గంగాధర్, తదితరులు ఉన్నారు.

ఉచిత హెూమియో వైద్య శిబిరం



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్లు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని వినాయక్ నగర్లోగల న్యూ హౌజింగ్ బోర్డ్ కాలనీ కమ్యూనిటీ హాల్ లో ఆదివారం ఉచిత హెూమియో వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ హెూమియో వైద్యులు డి.వి.వెంకట్ రెడ్డి, డాక్టర్ ఎస్.స్పందన, డాక్టర్ బి.శ్రీవాణి, ప్రముఖ ప్రభుత్వ అయుష్ జిల్లా అధిగారి గంగా దాసు, ప్రముఖ యోగాగురువులు సిద్దిరాములు, క్రాంతి కుమర్, బిఎల్‌పి రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్, న్యూ హౌసింగ్ బోర్డ్ అధ్యక్షులు డి.నర్సయ్య, కార్యదర్శి కమల కర్ రెడ్డి, డిటీఎఫ్ రాష్ట్ర నాయకులు శ్రీదర్, హెూమియో పతి డాక్టర్లు పవన్ కుమర్, మౌఖిక రాజు, సీనియర్, విలేకరులు జమాల్ పూర్ గణేష్, చింతల గంగాదాసు, వెంకటేష్, నర్సయ్య, తదితరులు పాల్గొని ఉచిత హెూమియో వైద్య శిబిరం ప్రారంభించారు. హౌసింగ్ బోర్డ్ కాలనీ వాసులకు, ఆర్య నగర్, వియకయక్ నగర్, నాందేవ్ వాడ, గౌతం నగర్, శివాజీ నగర్, గాయత్రి నగర్ తదితర ప్రాంతాల నుండి వచ్చి వారికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ.. హెూమియో వైద్యం ఉపయోగాలను క్షుణ్ణంగా వివరించారు. పాటించాల్సిన దినచర్య, ఆహార పద్ధతులు, యోగాసనాలను తెలిపారు. అతిచిన్నవయసులో హెూమియోపతి వైద్యురాలు డాక్టర్ స్పందన, డాక్టర్ శివాని వైద్య సేవలు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో యోగాచార్యులు సిద్దిరాములు, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మినర్సయ్య, సిద్దిరాములు, సబిత, దండి వెంకట్, వాసుదేవరావు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. శిబిరానికి హాజరైన వైద్యులు, ప్రముఖులను సన్మానించారు.

గ్రంధాలయ అభివృద్ధికి కృషిచేస్తా

- జిల్లా అధ్యక్షులు అంతిరెడ్డి రాజారెడ్డి



జిల్లా గ్రంథాలయ చైర్మన్‌ను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ - ధర్పల్లి

మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని ఆదివారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి సందర్శించారు.ఇటీవల ప్రభుత్వం ధర్పల్లి శాఖ గ్రంధాలయ అభివృద్ధికి 5 లక్షలు అందించడం జరిగిందని, అట్టి నిధులతో చేపట్టిన పనులకు అయన పరిశీలించారు. అనంతరం అయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని గ్రంథాలయాలకు ప్రభుత్వం పూర్వవైభవం తెచ్చేందుకు కృషి చేస్తుందని అన్నారు. తనవంతు సహకారం అందించేందుకు కృషి చేస్తానని, నేటి పాటకుల అభిరుచి మేరకు గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలు అందిస్తామని, ఎలాంటి అవసరాలు ఉన్న తన దృష్టికి తెస్తే వాటిని సమాకూర్చే ఏర్పాట్లు చేస్తానని అన్నారు. ఈసందర్భంగా అక్కడే ఉన్న పాఠకులు తమ గ్రంథాలయంలో వైఫై ఏర్పాటు చేయాలని కోరగా స్పందించి వెంటనే వైఫై ఏర్పాటుచేసి వినియోగంలోని తేవాలని గ్రంథపాలకుడు కిషన్ ను ఆదేశించారు. అనంతరం ఆయనను మండల కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి చెలిమెల నర్సయ్య, సొసైటి చైర్మన్ చిన్నారెడ్డి, మిట్టపల్లి గంగారెడ్డి, పుప్పాల సుభాస్, సురేందర్, బొక్కల బాలయ్య, అబ్దుల్ హమీద్, పోతరాజు, రాకేష్, హమీద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మంగిత్యా నాయక్, జాషువా, తదితరులు పాల్గొన్నారు.

ప్రేమం, త్యాగం, సహనానికి మారుపేరు ఆమె

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



మహిళా అధికారులను సన్మానించిన ఎన్‌డీసీసీబి చైర్మన్, అధికారులు

అంతుచిక్కని అనురాగం, ఎంతటి కష్ట సమయం అయిననూ ఓపికగా ఎదురుకునే ధీరత్వం, అతివలు అనంతమైన అద్భుతాలు సృష్టిచగలరని, ప్రేమంత్యాగంంసహనంక్షమఆమె అని ఎన్‌డిసిసిబి చైర్మన్ కుంట రమేష్ రెడ్డి కొనియాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఆదివారం ఎన్డిసిసిబి ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎన్‌డిసిసిబి చైర్మన్ కుంట రమేష్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, ధరణి నుండి అంతరిక్షం వరకు వారేనని, ఆలిగా, అమ్మగా, ఇల్లాలిగా తన పాత్ర సమర్ధవతంగా పోషిస్తారని, అంతులేని అనురాగం, ఎంతటి కష్ట సమయం అయినా ఓపికగా ఎదురుకునే ధీరత్వం వారిలో ఉంటుందని అన్నారు. ప్రేమం, త్యాగం, సహనానికి ఆమె మారుపేరని కొనియాడారు, ఈ సందర్భంగా మహిళలు అందరు కలసి కేక్ కటింగ్ చేశారు. బ్యాంకులో సీనియర్ మహిళా మేనేజర్లకు సన్మానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన అధ్యక్షుడు, ఉపాధ్యక్షులకు బ్యాంకు ముఖ్య కార్య నిర్వహణ అధికారికి యూనియన్ నాయకులు సన్మానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు నల్ల చంద్రశేఖర్ రెడ్డి , బ్యాంకు ముఖ్య కార్య నిర్వహణ అధికారి నాగ భూషణం వందే, టిసిసిబిఈఏ రాష్ట్ర నాయకులు రాధ, నిజామాబాద్ యూనిట్ కార్యదర్శి సందీప్, మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

రవన్న ఆశయాలను సాధిద్దాం

- సిపిఐ (ఎం.ఎల్) మాస్ లైన్ పిలుపు

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ/ఆర్మూర్



మాట్లాడుతున్న ఆకుల పాపన్న

రవన్న ఆశయాలను సాధిద్దామని సిపిఐ (ఎం.ఎల్) మాస్ లైన్ నాయకులు పిలుపునిచ్చారు. సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో రాయల సుభాష్ చంద్రబోస్ వర్ధంతిని నగంలోనిఎన్.ఆర్ భవన్, కోటగల్లిలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ మాట్లాడుతూ,... భారత విప్లవోద్యమంలో 50 సంవత్సరాలు అజ్ఞాత జీవితం గడిపి, అనేక ప్రజా ఉద్యమాలను నిర్మించిన ఘనత కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ (రవన్న)కు ఉందన్నారు. కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా నాయకులు ఎం.నరేందర్, డి. రాజేశ్వర్, డి.కిషన్, ఆల్గొట్ రవీందర్, జిల్లా కార్మిక నాయకులు బండారి లక్ష్మణ్,జి.శివకుమార్,కిరణ్ కుమార్,చరణ్, ఎస్.శివకుమార్,మాధవి, రవి కిరణ్, సిఎల్సి జిల్లా నాయకులు స్వామి, పి.డి.ఎస్.యు జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్ పాల్గొన్నారు.

రాయల రవన్న నిజాయితీకి మారుపేరు

న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య

రాయల రవన్న నిజాయితీకి మారుపేరుగా ఉన్నారని న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్యఅన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా, కేంద్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ (రవన్న) 9వ వర్ధంతిని నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నీలం రామచంద్రయ్య భవన్‌లో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కమిటీ కార్యదర్శి పరుచూరి శ్రీధర్, నగర కార్యదర్శి నీలం సాయి బాబా, శివ కుమార్, అరుణ, లక్ష్మీ, అగ్గు చిన్నయ్య, డి సాయిరెడ్డి, జి రమేష్, గోపాల్, రాధ, సంజన, జె రమేష్, సాయిలు, మల్లేష్, గంగాధర్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్:రాయల రావన్న స్ఫూర్తితో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమిద్దామని సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ సహాయ కార్యదర్శి దాసు శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని మామిడిపల్లి (శ్రామిక నగర్) లో న్యూ డెమోక్రసీ సబ్ డివిజన్ కార్యదర్శి సూర్య శివాజీ అధ్యక్షతన రవన్న తొమ్మిదవ స్మారక సభను పురస్కరించుకొని రవన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సభలో అరుణోదయ జిల్లా అధ్యక్షులు సూరిబాబు, పివైఎల్ జిల్లా మాజీ అధ్యక్షులు రవి, పిడిఎస్‌యు జిల్లా సహాయ కార్యదర్శి ప్రిన్స్, అరుణోదయ రంజిత్, పిడిఎస్యూ హుస్సేన్, ఐ ఎఫ్ టి యు నాయకులు వర్దారెడ్డి, అలిమ్, భాష, పిఓడబ్ల్యు నాయకులు మహమ్మదీ, పిడిఎస్‌యు నాయకులు రాహుల్, కళ్యాణ్, పవన్, రహమాన్ పాల్గొన్నారు.

వర్గీకరణ మాట నిలబెట్టుకోవాలి : ఎంఆర్‌పీఎస్

- నల్ల బ్యాడ్జీలతో నిరసన

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేసి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎం ఆర్‌పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షులు మైలారంబాలు మాట్లాడుతూ రిజర్వేషన్ల వర్గీకరణ అమలు చేయకుండా గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 ఫలితాలను విడుదల చేయడం ఆపాలని అన్నారు. అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి మాదిగలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 ఉద్యోగ నియామకాలలో వర్గీకరణ అమలు చేసి మాదిగలకు న్యాయం చేయాలని అన్నారు. ఆగస్టు 1 తేది 2024న సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాలకు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలు చేసుకోవచ్చని అధికారాలు ఇచ్చిందన్నారు. అప్పటికె విడుదలైన గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 నోటిఫికేషన్లలో రిజర్వేషన్లను అమలు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ వర్గీకరణ అమలు పరచకుండా గ్రూప్స్ ఫలితాలు విడుదల చేయడం వల్ల మాదిగలకు తీవ్రంగా అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోకుంటే మాదిగలను మోసం చేయడమే అవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాబట్టి ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను అమలుపరిచి గ్రూప్స్ ఉద్యోగాలలో మాదిగలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మందకృష్ణ మాదిగ నాయకత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి టౌన్ ఇన్చార్జి చెపూరి శ్యామ్ మాదిగ, ఎంఆర్పిఎస్ మండల అధ్యక్షులు మైలారం రాము మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి నుతుపల్లి సంతోష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల కోశాధికారి మంగళరం రవి మాదిగ , ఎమ్మార్పీఎస్ మండల సలహాదారులు రాజ గంగారం, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు సంకేపల్లి విప్లవ్ మాదిగ, ఎడపెల్లి సంతోష్, తరుణ్, రాజు తదితరులు పాల్గొన్నారు

10 విద్యార్థుల ఫేర్వెల్ హంగామా

నవతెలంగాణ - భీంగల్ రూరల్



డ్యాన్సులు చేస్తున్న విద్యార్థినులు



శ్రీ సరస్వతీ విద్యా మందిర్ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల ఫేర్వెల్ పార్టీ అద్భుతంగా జరిగింది. భీంగల్ పట్టణంలోని ప్రజలు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు ఈ కార్యక్రమానికి విచ్చేసినారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యక్షులు డాక్టర్ జి. బసంత్ రెడ్డి మాట్లాడుతూ మంచి ఫలితాలు సాధించాలని, భవిష్యత్తులో ఉన్నత స్థానంలో స్థిరపడాలని విద్యార్థులకు సూచించారు. శిశు మందిర్ లో చదివిన ప్రతి విద్యార్థి సమాజానికి అవసరమైన సహాయాన్ని అందించాలని, పుట్టిన ఊరును చదివిన పాఠశాలను, జన్మనిచ్చిన తల్లిదండ్రులను విద్య నేర్పిన గురువులను ఎప్పటికీ మర్చిపోకూడదని చెప్పారు. అలాగే విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు(డాన్సులు) ప్రజలను కట్టిపడేశాయి. పాఠశాల అధ్యక్షులు కే. గంగారం, ప్రధాన కార్యదర్శి జి నర్సయ్య, సంయుక్త కార్యదర్శి పి మనోహర్, కోశాధికారి జే సుధాకర్ రావు. విద్యా విషయక సలహాదారులు యెన్. శ్రీధర్, మంచే గణేష్, నీలం రవి, ప్రధానాచార్యులు రాస రవికుమార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జి. నర్సా రెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో మహిళా జర్నలిస్టుకు సన్మానం

నవతెలంగాణ కంఠేశ్వర్



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించు కుని టీబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో మహిళా జర్నలిస్టు అడవల అనితను జాతీయ కౌన్సిల్ సభ్యుడు కుంచం శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు కో కన్వీనర్లు కోరి రాకేష్, సభ్యులు ముత్యాల రవీందర్ పటేల్ కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. నేటి సమాజంలో మహిళలు పురుషులతో సమానంగా పనిచేస్తూ అన్నిట్లోనూ రాణిస్తున్నారని అన్నారు. ఎన్ని చట్టాలు ఉన్నా మహిళలపై దాడులు జరుగుతూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల రక్షణకు మరిన్ని ప్రత్యేక చట్టాలు తేవాలని, వాటిని కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

షటిల్ బ్యాడ్మింటన్ నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ 'షటిల్ 'బ్యాడ్మింటన్ అసోసియేషన్‌ను మండల కేంద్రంలోని 'భూదేవ్ ఇండోర్ స్టేడియం'లో ఆదివారం నిర్వహించారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షులుగా కొమ్ముల శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా అనికేషి గంగారాజు, కార్యదర్శిగా గంగుల నవీన్, కోశాధికారిగా చిల్క వినోద్, ఉపాధ్యక్షులుగా చిల్క దినేష్, సహ కార్యదర్శిగా ఓజ గంగాధర్‌ను సైతం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సభ్యులు తెలిపారు. కార్యవర్గ సభ్యులుగా పాల్ద వంశీ, జక్కుల ప్రవీణ్ లను ఎన్నుకున్నారు. ఎన్నిక అనంతరం నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. మండల కేంద్రంతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో షటిల్ క్రీడని ప్రోత్సహిస్తామన్నారు. క్రీడల్లో విద్యార్థులను, యువకులకు మెళు కువలను నేర్పుతూ, భవిష్యత్తు క్రీడాకారులుగా తీర్చిదిద్దుతామన్నారు. క్రీడా పోటీలను చేపడుతూ యువకులను ప్రోత్సహించడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముప్కాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు మణికాంత్, ప్రశాంత్, బ్రహ్మదండి రఘు, గగన్, రణధీర్, రాకేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బెడిసికొట్టిన వ్యూహం

- తలలు పట్టుకుంటున్న వ్యూహకర్తలు

నవతెలంగాణ-ధర్పల్లి



చిట్టీల కాల్చివేత

మండలకేంద్రంలోని ఇంటర్ మీడియట్ పరీక్షలకు మాస్‌కాపీయింగ్ కు కొందరు కళాశాల లెక్చరర్లు పన్నిన పన్నాగం బెడిసి కొట్టినట్లు కనిపిస్తుంది. చాప కింది నీరుల వారు అనుకున్న కొంతమంది విద్యార్థులకు బై టు బై మార్కులకోసం పన్నాగాం పన్నారు. అందుకు కావలసిన ఏర్పాట్లు చేసుకొని కొందరే సొమ్ము చేసుకుందామని వ్యూహం రచించారు. ఎవ్వరికి తెలవకుండా సైలెంటుగా కొనసాగించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. మండల కేంద్రంలో రెండు సెంటర్లు ఉండగా అందులో ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. మాకు మీరు, మీకు మేము అంటూ మా విద్యార్థులకు మీరు చూసి చూడనట్లు వ్యవహరించండి మీ విద్యార్థులకు మేము చూసుకుంటామనే ధోరణితో ఏర్పాట్లు చేసుకున్నారు. సిరికొండలోని ఓ కళాశాలకు చెందిన సుమారు వంద మంది విద్యార్థులు ఉన్నారు అంటూ ప్రత్యేకంగా మాట్లాడుకున్న కొందరు కాపీయింగ్ కోసం వ్యూహాలు రచించారు. కానీ అది ఆదిలోనే బెడిసి కొట్టినట్లు తెలిసింది. శుక్రవారం ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లిష్ పరీక్షరోజు మోడల్ పాఠశాలలో విద్యార్థులకు చాలా స్ట్రిక్ట్‌గా చేసినట్లు ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న కొందరు విద్యార్థులు అదేకళాశాలకు చెందిన ఓ లెక్చరర్ ముందు మోరపెట్టుకున్నట్టు తెలిసింది. అరే అదేంటి!అన్ని మాట్లాడినం కదా.. ఎందుకు అలా చేస్తున్నారు.. నేను మాట్లాడుతా అంటూ సదరు లెక్చరర్ విద్యార్థులకు మాట ఇచ్చినట్లు ఓప్రత్యేక్ష సాక్షి తెలిపారు. ఆరోజు అధికారులు వచ్చి సెంటర్లను పరిశీలించినట్లు తెలిసింది. వారికి ఎలాంటి అనుమానం వచ్చిందో ఏమో విధుల్లో ఉన్న సిబ్బంది ఫోన్లు తీయించి ఒక చోట పెట్టించినట్లు సమాచారం. తమకు కనీసం కన్నెత్తి చూడకుండా మరికొందరికి కావలసింది ఇస్తున్నారని స్వయంగా విద్యార్థులే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆ కళాశాల లెక్చరర్లు ఐతే నేరుగా పరీక్ష కేంద్రం సమీపానికి వచ్చి మరీ విద్యార్థులతో ముచ్చటించడం, ఇదేంటి మీరు ఇక్కడి నుండి వెళ్లాలని అని పోలీసులు అంటే వారికే ఎదురు మాట్లాడుతున్నారంటే ఇక్కడి తతంగం ఏందో అర్థం చేసుకోవచ్చు. జరుగుతున్న పరిణామాలకు మాట ఇచ్చిన లెక్చరర్ల గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయని తెలిసింది.

75శాంతం పంటలు ఎండిపోయాయి

- ప్రభుత్వం వెంటనే రైతులకు ఆదుకోవాలి
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ డిమాండ్



పంటలు పరిశీలిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్

నవతెలంగాణ-ధర్పల్లి

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో ఇప్పటికే 75శాంతం పంటలు ఎండిపోయాయని ప్రభుత్వం వెంటనే రైతులకు ఆదుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్ డిమాండ్ చేశారు. ఆదివారం అయన మండల కేంద్రముతోపాటు మండలంలోని అయాగ్రామాల్లో నీరు లేక ఎండిపోతున్న పొలాలను పరిశీలించారు. కిలోమీటర్ల మేర పైప్ లైన్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నామని, అయిన నీరు అందక పొలాలు ఎందుతున్నాయని, మరో 3,4 తడులు ఐతే కోతకు వచ్చేవని రైతులు కన్నీళ్లు పెట్టుకున్నారు. అనంతరం అయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే భూపతి రెడ్డికి ఈ ప్రాంత రైతుల గోస కనిపించడం లేదా అని ప్రశ్నించారు. 27 వేల కోట్లతో చేపట్టిన మంచిప్ప రిజర్వాయర్ పనులు 2 వేలకోట్లు పెట్టి చేయించారని, మరో 7 వేల కోట్లు వెచ్చించి మంచిప్ప నుండి భైరాపూర్, గడ్కోల్ వద్ద ఒక రిజర్వాయర్ నిర్మించి, పైప్ లైన్ ద్వారా ప్రతి మూడు ఎకరాలకు నీరు అందించినట్లయితే రూరల్ నియోజక వర్గంలో లక్ష ఎకరాలకు నీరు అందించగలరని చెప్పిన పట్టించుకోవడంలేదన్నారు. అత్యవసరంగా పంటలకు నీరు అందించే ఏర్పాటు చెయ్యాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో, ఇందల్వాయి, సిరికొండ, దర్పల్లి, జక్రానపల్లి, డిచ్ పల్లి మండల అధ్యక్షులు, సీనియర్ కార్యకర్తలు జిర్ర మహిపాల్ యాదవ్, కర్క గంగారెడ్డి, చిలుక మహేష్, నరేష్ గౌడ్, గంగాదాస్ గుప్తా, మురళి గౌడ్, శోభన్, తదితరులు పాల్గొన్నారు.

రాయల సుభాష్‌చంద్రబోస్‌కు ఘన నివాళ్లు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బోర్గం గ్రామంలో ఆదివారం కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ తొమ్మిదవ వర్ధంతిని సిపిఐఎంఎల్ ప్రజాపంథా మాస్ లైన్ నాయకులు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పుట్టినడిపి నాగన్న, పార్వతి రాజేశ్వర్, రెంజల్ మండల అధ్యక్షులు వడ్డేన్న, మండల కార్యదర్శి ఎస్కే నసీర్, మిద్దె పెద్దులు, పసుల సంతోష్, సిద్ధ పోశెట్టి, పసుల లక్ష్మణ్, మన్నె పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

పాణ బిక్షపెట్టండి

- బ్లడ్ క్యాన్సర్ తో బాధపడుతున్న బాలుడు
- ఆర్థిక సహాయం కోసం తల్లిదండ్రుల అభ్యర్థన



వేడుకుంటున్న కుటుంబీకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ప్రాణ విక్ష పెట్టండి... మా బాబును కాపాడండి అంటూ వేల్పూర్ మండలం పచ్చల నడుకుడ గ్రామానికి చెందిన ముస్కు నవీన్ రెడ్డి-మనోజ దంపతులు వేడుకుంటున్నారు. వ్యవసాయ కూలీలుగా కుటుంబాన్ని పోషించుకుంటున్న వీరి కుమారుడు నిక్లేష్(10) ఆరవ తరగతి చదువుతున్నాడు. నిక్లేష్ కు చాలా అరుదైన బ్లడ్ క్యాన్సర్ మిక్స్ ఫెనో టైప్ అక్యూట్ లుకేమియా (ఎంపిఏఎల్) అనే క్యాన్సర్ సోకింది. ప్రస్తుతం హైదరాబాద్ యశోద హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నాడు. ఇప్పటికే బాబు వైద్యం కోసం అప్పులు చేసి రూ.14 లక్షల ఖర్చు చేశారు. ఈ చికిత్స కోసం సుమారు రూ.50 నుండి 60 లక్షల వరకు ఖర్చు అవుతుందని డాక్టర్లు చెప్పినట్లు వారు వాపోయారు. తమ ఆర్థిక పరిస్థితి బాగా లేనందున మా కుమారుని వైద్యానికి దాతలుగా తోచినంత సహాయం అందించి, మా కుమారుడికి ప్రాణ బిక్ష పెట్టాలని ప్రాధేయపడుతున్నారు.ఆర్థిక సహాయం చేసేందుకు ముందుకు వచ్చే దాతలు 9494719197 నంబర్ లో (ఫోన్ పే నంబరు) సంప్రదించాలని వేడుకుంటున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
5
సోమవారం | మార్చి 10, 2025 | www.navatelangana.com

విద్యుత్ స్తంభాలను సరిచేయండి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



పోతంగల్ మండల్ సంకిని గ్రామానికి చెందిన ట్రాన్స్‌ఫార్మర్లకు ఉండే విద్యుత్తు వైర్లు వదులుగా కావడంతో పాటు, విద్యుత్ (పోల్స్) స్తంభాలు వంకరగా మారాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపైన అధికారులు దృష్టి సారించి విద్యుత్ స్తంభాలను నిలువుగా ఉండే విధంగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఒకవేళ ఏవైనా స్తంభాలు కింద పడిపోతే గ్రామం అంత చీకటమయం అయ్యే అవకాశాలు ఉన్నాయని, పంట పొలాలకు కూడా అందించే విద్యుత్ కూడా అంతరాయం ఏర్పడవచ్చు అని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. మండలంలోని తొర్లికొండ గ్రామానికి చెందిన వేముల భూలక్ష్మి ఈనెల 7న ఇంటికి తాళం వేసి ఆర్మూర్ లోని కూతురు దగ్గరికి వెళ్లింది. దొంగలు ఆమె ఇంటి తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న బంగారు వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఈనెల 8న బాధితురాలు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్నారు. డిచ్‌పల్లి సిఐ మల్లేష్ ఆధ్వర్యంలో ఎస్సై తిరుపతి వారి సిబ్బందితో చాకచక్యంగా వ్యవహరించి అదే గ్రామానికి చెందిన నూనె కిరణ్ అని పాత నేరస్తుని పట్టుకుని విచారించి అతని వద్ద నుండి బంగారు ఆభరణాలు ఒక ఐరన్ బాక్స్ స్వాధీన పరుచుకున్నట్లు తెలిపారు.

అడవికి నిప్పు



- కాలిపోయిన మొక్కలు
- లక్షల రూపాయలు వృథా
- పట్టించుకోని అటవీశాఖ అధికారులు

నవతెలంగాణ-లింగంపేట్

ప్రభుత్వం మొక్కలను పెంచి మన సంపదను పెంచడానికి కోట్లాది రూపాయలు ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఖర్చు పెడుతోంది. మరోవైపు గుర్తులేని వ్యక్తులు అడవికి నిప్పంటించడంతో అడవిలో నాటిన మొక్కలు పూర్తిగా కాలి బూడిదవుతున్నాయి. లక్షల రూపాయలు వృథా అవుతున్నాయి. అటవీశాఖ అధికారులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారని సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

అటవీశాఖ అధికారులు గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపులా అటవీ ప్రాంతాల్లో అక్కడక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి అడవికి నిప్పు పర్యావరణానికి ముప్పు అనే నినాదాలతో బోర్డులు ఏర్పాటు చేసినా ఫలితం లేకుండా పోతుంది. నినాదం కేవలం ఫ్లెక్సీలకే పరిమితమైపోతుంది. ప్రతి ఏటా హరితహారంలో భాగంగా అటవీ ప్రాంతంలో వివిధ రకాల మొక్కలు నాటినా.. అడవికి నిప్పంటుకోవడంతో నాటిన మొక్కలు కాలి బూడిదయిపోతున్నాయి. లక్షల రూపాయలు ప్రభుత్వ ధనం వృథా అవుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెట్లు పెంచితే సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని అటవీశాఖ అధికారులు, పర్యావరణ ప్రేమికులు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. అయినా ప్రతి ఏటా అడవులకు నిప్పు పెట్టడం వేలాది మొక్కలు కాలిపోవడంతో అడవులు మైదాన ప్రాంతాలుగా దర్శనమిస్తున్నాయి.

అటవీస్తీర్ణం తగ్గుముఖం..

కామారెడ్డి జిల్లాలో రెండు డివిజన్‌లు ఉన్నాయి. ఆరు సబ్ డివిజన్ ఆఫీసులున్నాయి. ఎల్లారెడ్డి, బాన్సువాడ, నాగిరెడ్డిపేట్, మాచారెడ్డి, నసురుల్లాబాద్, కామారెడ్డి వీటి పరిధిలో 86,190.48 హెక్టార్లలో అటవీ విస్తీర్ణం ఉంది. జిల్లాలో ముఖ్యంగా ఎల్లారెడ్డి, లింగంపేట్, బాన్సువాడ, గాంధారి, రామారెడ్డి, మొహమ్మద్‌నగర్‌లో దట్టమైన అటవీ ప్రాంతాలున్నాయి. అడవులను పెంచడానికి, అటవీ సంపదను కాపాడటానికి మొక్కలను కాపాడడానికి ప్రభుత్వం ప్రతి సంవత్సరం లక్షల రూపాయలు ఖర్చు పెడుతుంది. అయినప్పటికీ ప్రతి ఏటా అడవులను ఆక్రమించడం, అడవులను తగులబెట్టడంతో రోజురోజుకూ అడవులు అంతరించిపోతున్నాయి. మొక్కలు పూర్తిగా ఖాళీ బూడిదైపోతున్నాయి. ఎటు చూసినా మైదాన ప్రాంతాలుగా దర్శనమిస్తున్నాయి. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి మాసంలోనే గుర్తు తెలియని వ్యక్తులు అటవీ ప్రాంతానికి వెళ్లి విందులు, వినోదాలు చేసుకునేవారు, వాహనదారులు, సిగరెట్లు తాగే వారి వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని పలు అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 2023-24 సంవత్సరంలో హరితహారంలో భాగంగా నాలుగు లక్షల మొక్కలను అటవీ ప్రాంతంలో నాటారు. అటవీ ప్రాంతంలోని ఖాళీ స్థలాల్లో అల్ల నేరెడు, చీమ చింత, కానుగతో పాటు వివిధ రకాల మొక్కలు నాటారు. 2024-25 సంవత్సరానికి గానూ జిల్లావ్యాప్తంగా అటవీశాఖ ఆధ్వర్యంలో అటవీ ప్రాంతాల్లో మూడు లక్షల మొక్కలను అటవీశాఖ అధికారులు కూలీల సాయంతో నాటారు. ఒక్కొక్క మొక్కకు ఐదు నుంచి పది రూపాయల చొప్పున ఖర్చుపెట్టి మొక్కలు నాటారు. నాటిన మొక్కలను రక్షించడానికి చుట్టూ కంచెలు ఏర్పాటు చేశారు. మొక్కలకు నీరు అందించడానికి ట్యాంకర్ల సాయంతో నీటిని సరఫరా చేశారు. మొక్కలు చిగురించి పెరిగేదశలో అడవులకు నిప్పు పెట్టడంతో పెరుగుతున్న మొక్కలు పూర్తిగా కాలిపోతున్నాయి. దీనికి తోడు చుట్టుపక్కల ఉన్న మొక్కలు సైతం పెద్ద చెట్లు మంటల్లో కాలిపోతున్నాయి. ఆకులు రాలడంతో మంటలు విస్తరించి అటవీ ప్రాంతమంతా మంటలు వ్యాపిస్తున్నాయి. లక్షల రూపాయలు వృథా అవుతున్నాయి. అడవికి నిప్పు పెట్టి వారిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు అడవికి నిప్పు పెట్టడంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లే అవకాశాలున్నాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ముఖ్యంగా ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట్, గాంధారి, బాన్సువాడ, లింగంపేట్, మహమ్మద్‌నగర్, రామారెడ్డి, రాజంపేట్ ప్రాంతాల్లోనే ఇప్పటికే అడవులకు నిప్పు పెట్టడంతో కిలోమీటర్ల పొడవునా మంటలు వ్యాపించి నాటిన మొక్కలతో పాటు ఇతర మొక్కలు పూర్తిగా కాలిపోతున్నాయి. రోజురోజుకూ అటవీ ప్రాంతంలో మొక్కలు అంతరించిపోయే అవకాశాలున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. అటవీ శాఖ అధికారులు మంటలార్పడానికి ప్రయత్నం చేసిన ఫలితం లేకుండా పోతోంది. నామమాత్రంగా మంటలు ఆర్పుతున్నారని పలువురు మండిపడుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం

గ్రామాల్లో అటవీ శాఖ ఆధ్వర్యంలో అడవులకు నిప్పు పెట్టవద్దని అవగాహన కల్పిస్తున్నాం. గుర్తు తెలియని వ్యక్తులే అడవికి నిప్పు పెడుతున్నారు. సమాచారం ఇస్తే అటవీశాఖ చట్ట ప్రకారం వారిపై కేసులు నమోదు చేస్తాం. ఇప్పటికే రాత్రివేళ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. అడవులను రక్షించే బాధ్యత అందరిపై ఉంది.

– నిఖిత, జిల్లా అటవీ శాఖ అధికారి

11న సాయిబాబ మందిరంలో శ్రీరామనవమి యాక్షన్

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

నిజామాబాద్ పరిధిలోని మాధవ నగర్ సాయిబాబా మందిరంలో శ్రీరామ నవమి పురస్కరించుకొని వచ్చే నెల 5, 6 తేదీల్లో సాయిబాబా మందిరంలో విద్యుత్ దీపాలంకరణ, పూల అలంకరణ, సున్నాలు, రంగులు, టెంట్ హౌస్, క్యూ లైన్లు, అదే రోజు అన్నదానం చేయుటకు 20 క్వింటాళ్ల అన్నం, రెండు కూరలు, సాంబారు కొటేషన్ తీసుకొనుటకు వ్యాపారస్తులు, ఔత్సాహికులు ఈ నెల నెల 11న మంగళవారం 11 గంటలకు రావాలని కోరారు. అదే రోజు రెండు గంటలకు దేవాదాయ శాఖ నుండి దేవదాయ శాఖ అధికారి సమక్షంలో తక్కువ కోడ్ చేస్తారో వారికే ఈ కాంట్రాక్టు అప్పగించబడుతుందని మాధవ నగర్ సాయిబాబా మందిరం ఈవో రవీందర్ గుప్తా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

న్యూ హరిజోన్స్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-ముప్కాల్

ఇటీవల జాతీయ స్థాయిలో నిర్వహించిన ఒలింపియాడ్ 'మాథ్స్ అండ్ సైన్స్' ఎగ్జామ్ లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మండల కేంద్రంలోని న్యూ హరిజోన్స్ పాఠశాల విద్యార్థులకు ఆదివారం 'రవీంద్ర భారతి' హైదరాబాద్ లో బహుమతులను ప్రధానం చేశారని పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రవిలాస్ తెలిపారు. పి.శ్రీహాన్ జాతీయ స్థాయిలో 10వ ర్యాంక్ సాధించగా, కె.సృజన్ రాష్ట్ర స్థాయిలో 9వ ర్యాంక్, ఎస్.విహాన్ జిల్లా స్థాయిలో 10వ ర్యాంక్ లు సాధించారని అన్నారు. ప్రతిభ కనబర్చిన పాఠశాల విద్యార్థులను ఉపాధ్యాయ బృందం అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బి.రత్నాకర్, పి. శైలజ, బి.వినీల, బి.రుచిత పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



ఒక్క చోట చేరిన పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

చిన్ననాడు ఆడిపాడుతూ చదువుకున్న చిన్నప్పటి స్మృతులను గుర్తుచేసుకుంటూ చదువులమ్మ ఒడిలో సందడి చేశారు.మోస్రా భారతీయ విద్యానికేతన్ హై స్కూల్ 1996-97 బ్యాచ్ విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని అపూర్వంగా జరుపుకున్నారు. చదువులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించుకున్నారు. శాలువా, పూల దండలు వేసి, మెమెంటో అందజేసి గురువులు రంగారావు అనసూయ, శివసచరణ్, హరిచర్సన్, వెంకటేష్, సంజీవ్, గోపాల్, నాగభూషణం, సాయిలు, విజేందర్, స్వరూప పాదాలకు నమస్కరించారు. ఉదయం నుంచి డిఆర్ఆర్ ఫంక్షనల్ లో ఎంతో ఉల్లాసంగా గడిపారు. ఎవరు ఎక్కడ, ఏ రంగంలో స్థిరపడ్డారో సమ్మేళనంలో పరిచయం చేసుకున్నారు. ఆనాటి తీపి గుర్తులను నెమరు వేసుకుంటూ సంతోషంగా గడుపుతారు. పాఠశాల ద్వారా తాము ఇంత మంది కలవడం సంతోషం గా ఉంది అని అన్నారు.అందరు కలిసి భోజనాలు చేశారు. ఎంతో మందిని ఉన్నతులుగా తీర్చిదిద్దిన భారతీయ విద్యా నికేతన్ హై స్కూల్ రుణం తీర్చుకోలేనిదని విద్యార్థులు అన్నారు. గురువులకు ఎప్పటికీ రుణపడి వుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు 1996-1997 బ్యాచ్ తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా ఆయిల్ ఫామ్ సాగు

- 190 ఎకరాల్లో సాగు



సాగుచేసిన ఆయిల్‌ఫామ్ పంట

నవతెలంగాణ-రెంజల్

తెలంగాణలో ఆయిల్ ఫామ్ సాగు చేయడానికి ప్రభుత్వం ప్రోత్సహించడంతో రైతులు ఆయిల్ ఫామ్ సాగు చేయడానికి ముందుకు వచ్చారు. మండలంలో సుమారు 190 ఎకరాలలో సాగు చేయడానికి వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించడంతో రైతులు సాగుచేశారు. నేడు ఈ పంట ఆశాజనకంగా మారింది.

మండలంలో ముందుగా ఆయిల్ ఫామ్ సాగు చేసిన రైతుల పొలాలలో గెలలు వేయిస్తున్నాయి. ఈ గెలలను ప్రభుత్వమే కొనుగోలు చేయడానికి ముందుకు రావడంతో రైతులు ఈ పంట వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రతి సంవత్సరం ఆయిల్ ఫామ్ మొక్కల మధ్యలో భూమి వృథాగా ఉండకుండా అంతర్ పంటగా మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ఈ సాగుకు ప్రభుత్వం కల్పించడంతో డ్రిప్ సిస్టం ద్వారా నీటిని అందిస్తున్నారు. ప్రభుత్వం రైతులకు మరింత అవగాహన కల్పించినట్లయితే ఈ సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది.

ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలో ఉన్న ప్రజలు ప్రభుత్వం కల్పించిన ఎల్ఆర్ఎస్ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ రాజు ఆధ్వర్యంలో ఇటీవల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా, మామిడిపల్లి చౌరస్తా ప్రధాన కూడలల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకొని 25శాతం రాయితీ పొందాలని, ఈ అవకాశం మార్చి 31 వరకు మాత్రమే ఉందని తెలుపుతూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినట్టు కమిషనర్ ఆదివారం తెలిపారు. 2020లో వెయ్యి రూపాయలు రుసుం చెల్లించి ఎల్ఆర్ఎస్‌కు రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్లాట్‌ల యజమానులు అనుమతిలేని లేఅవుట్లలోని ఖాళీ ప్లాట్‌లను రెగ్యులరైజేషన్ చేసుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం 2025 మార్చి 31 తేదీ వరకు అవకాశం కల్పించిందని కమిషనర్ తెలిపారు. అనుమతి లేని లేఔట్లలో 10శాతం ప్లాట్ల రిజిస్ట్రేషన్ అయి మిగతా కానీ వాటిని కూడా సబ్ రిజిస్టర్ కార్యాలయం నందు రిజిస్ట్రేషన్ తో పాటు ఎల్ఆర్ఎస్ రుసుము కూడా చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చుని, ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

ఇద్దరు రిమాండ్

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని అమ్రాద్ తండాలో శనివారం జరిగిన దాడి ఘటనలో నిందితులైన అన్నదమ్ములు కేతవాత్ రమేష్, విక్రమ్, కేతావత్ పీర్సింగ్‌లను ఆదివారం అదుపులోకి తీసుకునట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. విక్రమ్ వద్ద నుండి దాడికి ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకొని ఇరువురిని అరెస్ట్ చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచి జ్యూడిషల్ రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన ముగ్గురు అన్న దమ్ముల ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉన్నట్లు తెలిపారు.

మున్సిపల్‌లో ఇష్టారాజ్యం

- సమయ పాలనలో అధికారుల ఇష్టారీతి
- ప్రశ్నిస్తే.. ఎవరు ఎప్పుడు వస్తే మీకేంటి అంటూ ఎదురు ప్రశ్న
- నేడు మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

నవతెలంగాణ-కామారెడ్డి



ఖాళీగా దర్శనమిస్తున్న అకౌంటెంట్ కుర్చీ



మున్సిపల్ కార్యాలయం

కామారెడ్డి మున్సిపల్ కార్యాలయానికి ప్రతిరోజు ఎంతోమంది వివిధ పనులపై వస్తూ వెళ్తూ ఉంటారు. ఒక్కొక్కరికి ఒక్కొక్క శాఖలో వివిధ రకమైన పనులుంటాయి. కామారెడ్డి పురపాలక సంఘం కార్యాలయంలో మున్సిపల్ శాఖ అకౌంటెంట్ రాములు సమయపాలన పాటించడం లేదని.. మున్సిపల్‌కు వివిధ పనులపై వచ్చే ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై మున్సిపల్‌లో పనిచేస్తున్న ఇతర సిబ్బందిని విచారించగా అకౌంటెంట్ రాములు మున్సిపల్ కార్యాలయానికి ప్రతిరోజు 12 గంటలు దాటిన తర్వాత వస్తున్నాడని వచ్చి రెండుగంటలు గడవక ముందే మళ్లీ ఏదో టైంలో వెళ్ళిపోతున్నాడని తెలపడంతో.. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డిని వివరణ కోరగా మీడియాతో మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి మాట్లాడారు. 'అకౌంటెంట్ రాములు ఎప్పుడొస్తే ఏముందండి. అతను లేకపోతే అకౌంటెంట్ పనులు ఆగడం లేదు కదా.' అని సమాధానమిచ్చారు. మున్సిపల్ కార్యాలయానికి ఎన్ని గంటలకు రావాలని అడిగితే 'అకౌంటెంట్ సెక్షన్ అనేది చాలా ప్రశాంతమైన వాతావరణంలో ఉండాలి. కాబట్టి తన పని తాను చేసుకుంటున్నాడు. అతను ఎప్పుడు వస్తే ఏంటి మీకు వారితో ఏమన్నా పని ఉందా..?' అని చెప్పడం చాలా విడ్డూరకరంగా ఉందని పలువురు పేర్కొంటున్నారు. సమయపాలన పాటించని మున్సిపల్ అకౌంటెంట్ రాములుపైన జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ చర్యలు తీసుకొని సమయపాలన పాటించేలా చూడాలని కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని ప్రజలు కోరుతున్నారు.

వామ్మో కుక్కలు



- గుంపులుగా సంచారం
- భయాందోళనలో ప్రజలు

నవతెలంగాణ-జుక్కల్

కుక్కల బెడదతో పాదచారులు, వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. జుక్కల మండల కేంద్రం మేజర్ గ్రామపంచాయతీలో ప్రజలకు కుక్కల బెడద తప్పడం లేదు. పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు సమస్యను విన్నవించినా గ్రామపంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో కుక్కల బెడద అధికమైంది. కుక్కలు వీధులలో గుంపులుగా తిరుగుతూ స్వైర విహారం చేస్తున్నాయి.

గ్రామంలో చిన్న పిల్లలు, పెద్దలు, వృద్ధులు అనే తేడా లేకుండా వారిపై దాడులకు పాల్పడుతూ భయాందోళనకు గురిచేస్తున్నాయి. పట్టించుకోవలసిన జీపీ సిబ్బంది తమకేమీ ఎరుగనట్టుగా పట్టించుకోకపోవడంతో ఇప్పటికే గ్రామంలో వందల కొద్దీ కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఎక్కడపడితే అక్కడ గుంపులు గుంపులుగా విధులలో తిరుగుతున్నాయి. పాదచారులు, ద్విచక్ర వాహనదారులు వెళ్లేటప్పుడు వారిని కుక్కలు వెంబడించడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా జిపి సిబ్బంది స్పందించి కుక్కల బెడదను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అనుమతులు లేకుండా యథేచ్ఛగా ఇటుకబట్టీల ఏర్పాటు

- అక్రమంగా చెరువు, కుంటల నుంచి మట్టి తరలింపు
- బాలకార్మికులతో పని చేయిస్తున్న వైనం
- మామూలుగా తీసుకుంటున్న అధికారులు?

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్



పొలాల మధ్యలో ఏర్పాటు చేసిన ఓ ఇటుక బట్టీ



హైవే పక్కన వెలిసిన ఇటుకబట్టీ



ఇటుక బట్టీలో చిన్నపిల్లలతో పనులు

పెద్దకొడప్ గల్ మండలం ఇతర గ్రామాలలో భవన నిర్మాణాలు జోరుగా సాగుతుండడంతో మండలంలోని ఇటుక బట్టీలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. చాలా వరకు అనుమతులు లేకుండానే కొనసాగుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నాయి. మండలంలోని దాదాపుగా 20కి పైగానే ఇటుక బట్టీలు ఉన్నాయి. మండలంలో ఇటుక బట్టి వ్యాపారులు వ్యవసాయ భూమిని తీసుకొని ఈ వ్యాపారం కొనసాగిస్తున్నారు. వ్యవసాయ భూములను ఇటుక బట్టలుగా మార్చడంతో పక్కకు ఉన్న పంట పొలాల్లో కాలుష్యం ద్వారా సరిగ్గా పడటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్న. అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదని రైతులు వాపోతున్నారు. ఇటుకలను తయారీ చేయడానికి ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి కార్మికులను తీసుకువస్తుంటారు.

అనుమతులు లేకుండానే ఏర్పాట్లు

ఇటుక బట్టి నిర్వాహకులు ఎటువంటి నియమ నిబంధనలు లేకుండా యదేచ్ఛగా నడుపుతున్న అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు దారితీస్తుంది. ఇటుక బట్టీల ఏర్పాటుకు ఆయా గ్రామ పంచాయతీ లతో పాటు రెవెన్యూ శాఖ, కాలుష్య నియంత్రణ మండలి నుంచి అనుమతులు తప్పకుండా తీసుకోవాలి, కానీ కొందరు వ్యాపారులు మాత్రం నిబంధనలు పాటించడం లేదు. అంతేకాకుండా నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భూముల్లోనూ బట్టీలు నిర్వహిస్తున్నారు. వ్యవసాయ భూముల్లో ఇటుక బట్టీలు ఏర్పాటు చేయాలంటే నాలా సుంకం చెల్లించాలి. నాలా సుంకం చెల్లించకుండానే వ్యాపారం చేస్తున్నారు. వాల్టా చట్టాన్ని ఉల్లంఘించి చెరువులు, కుంటల నుంచి మట్టిని తరలిస్తూ ఇటుకల తయారీకి వినియోగిస్తున్నారు.

ప్రధాన రహదారుల వెంట బట్టీలు

జాతీయ రహదారి 161 మండలం నుండి బిచ్కుంద దగ్గర వైపు వెళుతున్న వాహనదారులు రహదారుల పక్కనే ఇటుక బట్టీలు ఏర్పాటు చేయడం వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గాలికి బూడిద కొట్టుకువచ్చి కంట్లో పడుతుంటడంతో పలువురు ప్రమాదాల బారినపడుతున్నారు. మరికొందరికి కంటి సమస్య తలెత్తుతుంది. ఇటుకు బట్టీల నుంచి వెలువడుతున్న పొగతో రోడ్డు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన చెందుతున్నారు.

బాల కార్మికులతోనూ పనులు

ఇటుక బట్టీల వ్యాపారులు ఎక్కువగా ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి కార్మికులను తీసుకువస్తుంటారు. ఇందులో బాల కార్మికులే ఎక్కువగా ఉండడం గమనార్హం. ప్రతి ఇటుక బట్టీ వ్యాపారి వద్ద సుమారు నలుగురు నుంచి ఐదుగురు వరకు బాల కార్మికులు పని చేస్తుంటారు. అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ఇటుక బట్టీలపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT: NIZAMABAD

ARB. NO. 316 of 2024

Between:-

M/s Panduranga Chit Fund Private Limited., Armoor, Dist:Nizamabad. represented by it's Foreman/ Director Mr.P.LingaGoud.

...Disputant

And

Vemula Amarendranath & Others

..Opponents

To,

Opp.No.

2.Balgoori Rajith kumar Rao,S/o.B.Prabhaker Rao,H.No.7-23/2,Sri rama colony, near Ganga Nursing home, Post: Mamidipally, Mdl: Armoor, Dist: Nizamabad.

6. Burra Narsaiah, S/o.Bhoomeshwar, H.No.7-122/A,Sri Ramacolony, Post: Mamidipally, Mdl:Armoor, Dist: Nizamabad. Occu: TGT(Maths) Telangana Minarities school&college, Armoor Boys-1, Post: Aloor, Mdl: Armoor, Dist: Nizamabad.

The Disputant has filed the dispute for recovery of amount and notices sent on your addresses are returned unserved. Whereas the dispute is posted for your appearance on **02.04.2025 at 10.30 A.M.** you are called upon hereby to appear in person before the Hon'ble Deputy Registrar of Chits/Arbitrator, Nizamabad on the said date failure of which the dispute will be heard and decided expartee.

// By order of the Deputy Registrar of Chits/Arbitrator //

Sd-

Deputy Registrar of chits/Arbitrator, Kavitha Complex, Nizamabad.